# పెన్ పవర్

## తెలంగాణ రౌండప్

గురువారం 27 మార్చి 2025 పేజీలు 8




## కలెక్టర్లనైనా బదిలీ చేయొచ్చు కానీ..
## టీచర్ల ట్రాన్స్‌ఫర్ ఆషామాషీ కాదు

**హైదరాబాద్ పెన్ పవర్:** విద్య పట్ల ప్రత్యేక విధానం తీసుకురావాలనేది మా ప్రభుత్వ ఉద్దేశమని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. విద్యా రంగానికి సూచనల కోసం కమిషన్ ఏర్పాటు చేశామని.. విద్యాశాఖ కమిషన్ చైర్మన్?గా ఐఏఎస్ అధికారిని నియమించామని తెలిపారు. విద్యా కమిషన్ రాష్ట్రవ్యాప్తంగా పర్యటించి సలహాలు ఇచ్చిందని చెప్పారు. తెలంగాణ అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల్లో భాగంగా బుధవారం శాసన మండలిలో విద్యాశాఖపై జరిగిన చర్చ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడారు. 2021లో తెలంగాణలోని 3, 5వ తరగతుల విద్యార్థులపై నేషనల్ అచీవ్?మెంట్ సర్వే జరిగిందని.. ఆ స్టడీ ప్రకారం 75 శాతం మంది విద్యార్థులు కనీస సామర్థ్యాలు చూపట్లేదని అన్నారు. ఈ సర్వేలో తెలంగాణ ర్యాంకు చివరి నుంచి ఐదో స్థానంలో ఉందన్నారు. 3వ తరగతి విద్యార్థులకు తెలుగు, హిందీ, ఇంగ్లీష్ పరిజ్ఞానంలో తెలంగాణ 36వ స్థానంలో ఉందని పేర్కొన్నారు. అదే విధంగా 3వ తరగతి విద్యార్థులకు గణిత పరిజ్ఞానంలో తెలంగాణ 35వ స్థానంలో ఉందని చెప్పారు.దేశంలోని మిగతా రాష్ట్రాలతో పోలిస్తే..

-2 లో

# ఉప ఎన్నికలు వస్తాయో..
# రావో కోర్టు చెప్తుంది.. మీరు కాదు



**హైదరాబాద్ పెన్ పవర్:** తెలంగాణలో ఉప ఎన్నికలు నిర్వహించాలా వద్దా అనే అంశం కోర్టు పరిధిలో ఉందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పేర్కొన్నారు.శాసనసభలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రాష్ట్రంలో ఉప ఎన్నికలు ఉండబోవని చేసిన ప్రకటనపై ఆయన స్పందించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తన హొదాను విస్మరిస్తున్నారని కేటీఆర్ వ్యాఖ్యానించారు.ఎమ్మెల్యేల అనర్హత పిటిషన్లపై శాసనసభ వేదికగా తీర్పు వెల్లడించేందుకు ప్రయత్నిస్తున్నారని విమర్శించారు. కోర్టుల్లోని అంశాలపై వ్యాఖ్యలు చేయకూడదనే నిబంధనలు ఉన్నాయని ఆయన గుర్తు చేశారు. ముఖ్యమంత్రి తనను తాను నిబంధనలకు అతీతంగా భావిస్తున్నారని, సుప్రీంకోర్టు కంటే ఎక్కువ అనుకుంటున్నారని అన్నారు.ముఖ్యమంత్రి వ్యవహారశైలిని న్యాయస్థానాల దృష్టికి తీసుకువెళతామని ఆయన స్పష్టం చేశారు. రేవంత్ రెడ్డి ముఖ్యమంత్రిగా తన బాధ్యతలను గుర్తించి, పాలనపై దృష్టి సారించాలని హితవు పలికారు. ఉప ఎన్నికల నిర్వహణ అంశం కోర్టు నిర్ణయంపై ఆధారపడి ఉంటుందని ఆయన పునరుద్ఘాటించారు.

- రాష్ట్రంలో ఉప ఎన్నికలు రాబోవన్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి
- ఎమ్మెల్యేల అనర్హత పిటిషన్లపై అసెంబ్లీ వేదికగా తీర్పు ఇవ్వాలని చూస్తున్నారని విమర్శ
- సుప్రీంకోర్టు కంటే తాను ఎక్కువ అని సీఎం భావిస్తున్నారని విమర్శ

-2 లో



## యాదగిరి గుట్టకు పోటెత్తిన భక్తులు..
## రికార్డ్ స్థాయిలో హుండీ ఆదాయం..

**హైదరాబాద్ పెన్ పవర్:**యాదగిరి గుట్ట శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి దేవస్థాన హుండీకి భారీగా ఆదాయం వచ్చింది. గత 65 రోజుల్లో యాదగిరి లక్ష్మీనరసింహ స్వామి వారి హుండీకి నగదు రూపంలో4 కోట్ల 43 లక్షల 4 వేల 995 రూపాయల ఆదాయం వచ్చిందని ఆలయ అధికారులు తెలిపారు. కానుకల రూపంలో 296 గ్రాముల బంగారం, 13 కిలోల వెండిని కూడా భక్తులు సమర్పించారని వెల్లడించారు. అదేవిధంగా విదేశీ కరెన్సీ కూడా వచ్చిందని పేర్కొన్నారు. వారాంతాల్లో, సెలవు రోజుల్లో భక్తులు భారీగా తరలివస్తుండడంతో ఆలయానికి రద్దీ పెరుగుతోంది. భక్తులు తండోపతండాలుగా తరలివచ్చి పూజలు చేసి మొక్కు తీర్చుకుంటుండడంతో ఆలయానికి భారీ ఆదాయం సమకూరుతోంది. మన డబ్బులతోపాటు విదేశీ నగదును కూడా భక్తులు సమర్పించారు. అలాగే ఆభరణాలను సైతం ఆలయ హుండీకి సమర్పించారు.

# సీఎం అలా ఎలా మాట్లాడుతారు..?
## స్పీకర్ పోడియం ముందు బీఆర్ఎస్, ఎంఐఎం నిరసన

**హైదరాబాద్ పెన్ పవర్:** తెలంగాణ అసెంబ్లీలో గందరగోళం నెలకొంది. పార్టీ ఫిరాయింపులపై సీఎం రేవంత్ రెడ్డి చేసిన వ్యాఖ్యలపై దుమారం చెలరేగింది. ఎమ్మెల్యేల పార్టీ ఫిరాయింపు వ్యవహారం సుప్రీంకోర్టులో ఉందని.. కోర్టు పరిధిలో ఉన్న అంశంపై సీఎం రేవంత్ రెడ్డి ఎలా మాట్లాడుతారని ప్రతిపక్ష బీఆర్ఎస్, ఎంఐఎం సభలో ఆందోళనకు దిగాయి. స్పీకర్ పోడియం ఎదుట బీఆర్ఎస్, ఎంఐఎం సభ్యులు నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీష్ రావు మాట్లాడుతూ.. కోర్టు పరిధిలో

-2 లో





### హైదరాబాద్‌లో ఇద్దరు
## అంతర్జాతీయ సైబర్ నేరగాళ్లు అరెస్ట్

**హైదరాబాద్ పెన్ పవర్:** సైబర్ మోసాలకు పాల్పడుతోన్న ఇద్దరు అంతర్జాతీయ నేరగాళ్ల ఆటకట్టించారు హైదరాబాద్ సైబర్ క్రైం పోలీసులు. బిజినెస్ ఇన్వెస్ట్ మెంట్ పేరుతో మోసాలు చేస్తోన్న ఇద్దరిని బుధవారం (మార్చి 26) అరెస్ట్ చేశారు. పోలీసుల వివరాల ప్రకారం.. నిందితులు అమర్ నాథ్ సింగ్, రణ్ వీర్ సింగ్ అంతర్జాతీయ కంపెనీల్లో పెట్టుబడుల పేరుతో అమాయక ప్రజలను మోసం చేస్తున్నారు. మొబైల్ ఫోన్ల ద్వారా ఆర్డర్లు అందిస్తామని ప్రలోభపెట్టి పలువుర్ని బురిడి కొట్టించారు. ఈ నేపథ్యంలోనే హైదరాబాద్?కు చెందిన ఓ వ్యక్తికి నకిలీ మెయిల్ పంపి సుమారు

## హైదరాబాద్‌లో ఇద్దరు అంతర్జాతీయ సైబర్ నేరగాళ్లు అరెస్ట్

- మొదటి పేజి తరువాయి

10 లక్షల రూపాయలు మోసానికి పాల్పడ్డారు. బాధితుడు హైదరాబాద్ సైబర్ క్రైం పోలీసులను ఆశ్రయించాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టిన సిటీ సైబర్ క్రైం పోలీసులు.. అంతర్జాతీయ మోసాలకు పాల్పడుతోన్న అమర్ నాథ్ సింగ్, రణ్ వీర్ సింగ్?లను చాకచక్యంగా వ్యవహరించి బుధవారం (మార్చి 26) అరెస్ట్ చేశారు. ఈ సందర్భంగా ప్రజలకు సైబర్ క్రైం పోలీసులు మరోసారి కీలక సూచనలు చేశారు. గుర్తు తెలియని నెంబర్ల నుంచి ఫోన్ కాల్స్, మేసేజ్?ల పట్ల జాగ్రత్తగా ఉండాలని సూచించారు. కొత్త నెంబర్ల నుంచి వచ్చే మేసేజులు, లింక్?లను ఓపెన్ చేయొద్దని హెచ్చరించారు. ఒకవేళ సైబర్ మోసానికి గురైతే వెంటనే ఫిర్యాదు చేయాలని సూచన చేశారు. చాకచక్యంగా వ్యవహరించి అంతర్జాతీయ సైబర్ నేరగాళ్లను అరెస్ట్ చేసిన సిబ్బందిని ఉన్నతాధికారులు ప్రశంసించారు.

## సీఎం అలా ఎలా మాట్లాడుతారు..?

- మొదటి పేజి తరువాయి

ఉన్న ఎమ్మెల్యేల ఫిరాయింపు అంశంపై సీఎం సభలో ఎలా మాట్లాడుతారని ప్రశ్నించారు. వెంటనే కలగజేసుకున్న మంత్రి శ్రీధర్ బాబు ప్రతిపక్షాల నిరసనలను తీవ్రంగా ఖండించారు. సీఎం రేవంత్ రెడ్డి కోర్టు తీర్పు గురించి మాట్లాడలేదని.. కేవలం ఫిరాయింపుల విషయంలో గతంలో మాదిరిగానే వ్యవహరిస్తామని అన్నారని వివరణ ఇచ్చారు. సీఎం మాట్లాడిన దాంట్లో తప్పేమి లేదని.. ఉప ఎన్నికలు వస్తాయని బయట బీఆర్ఎస్ నాయకులు చేస్తోన్న బెదిరింపుల గురించి మాత్రమే మాట్లారని శ్రీధర్ క్లారిటీ ఇచ్చారు. మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ.. పార్లమెంట్లో కూడా ఇలాంటి అంశంపై చర్చ జరుగుతోందని పేర్కొన్నారు. జ్యుడిషియరిని విమర్శించే హక్కు పార్లమెంట్?లో కూడా ఉంటుందని అన్నారు. మంత్రుల వివరణతో సంతృప్తి చెందని బీఆర్ఎస్, ఎంఐఎం ఎమ్మెల్యేలు నిరసన కంటిన్యూ చేస్తున్నారు. దీంతో సభలో గందరగోళ పరిస్థితి నెలకొంది.

అంతకుముందు సభలో సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ.. "పార్టీ ఫిరాయింపులపై బీఆర్ఎస్ నేతలు గగ్గోలు పెడుతున్నారు. ప్రతిరోజు ఉప ఎన్నికలు వస్తాయని ప్రచారం చేస్తున్నారు. 2014 నుంచి 2024 వరకు రాష్ట్రంలో ఎలాంటి సంప్రదాయం ఉందో అదే సంప్రదాయాన్ని మేం ఫాలో అవుతున్నాం. పార్టీ మారిన ఎమ్మెల్యేలకు బీఆర్ఎస్ మంత్రి పదవులు ఇచ్చింది. మేం ఎలాంటి పదవులు ఇవ్వడం లేదు. వాళ్ల అడుగుజాడల్లో మేం నడవడం లేదు. ప్రతి రోజు ఉప ఎన్నికలు వస్తాయని ప్రచారం చేస్తున్నారు. ఫిరాయింపుల అంశం కోర్టు పరిధిలో ఉంది. తెలంగాణలో ఎలాంటి ఉప ఎన్నికలు రావు. ఎమ్మెల్యేలు ఆందోళన చెందాల్సిన అవసరం లేదు. మా దృష్టి ఉప ఎన్నికలపై లేదు.. అభివృద్ధిపైనే ఉంది" అని అన్నారు.

## కలెక్టర్లనైనా బదిలీ చేయొచ్చు కానీ..

## టీచర్ల ట్రాన్స్‌ఫర్ ఆషామాషీ కాదు

- మొదటి పేజి తరువాయి

ఈ విషయంలో తెలంగాణ అధమ స్థానంలో ఉందని వ్యాఖ్యానించారు. ప్రభుత్వ పాఠశాలల్లో ఐదో తరగతి విద్యార్థులు.. రెండో తరగతి పుస్తకాలు చదవలేని పరిస్థితి ఉందన్నారు. ప్రతిస్థాయిలో విద్యారంగం రోజురోజుకు క్షీణించిపోతుందని ఆవేదన వ్యక్తం చేశారు. విద్యా రంగాన్ని తిరిగి గాడినపెట్టడానికి కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక 11 వేలకు పైగా టీచర్ల నియామకం చేపట్టాం.. 21 వేల మందికి పైగా టీచర్లకు పదోన్నతులు కల్పించామని తెలిపారు. ఏడెనిమిదేళ్లుగా పెండింగ్లో ఉన్న 36 వేల మంది టీచర్ల బదిలీ ప్రక్రియ చేపట్టామన్నారు. కలెక్టర్లనైనా బదిలీ చేయవచ్చు కానీ.. టీచర్ల ట్రాన్స్?ఫర్లు ఆషామాషీ కాదని ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. 36 వేల మంది టీచర్లను చిన్న ఆరోపణలు లేకుండా బదిలీ చేశామని గుర్తు చేశారు.

# ఆస్తి పన్నుదారులకు తీపి కబురు

**హైదరాబాద్ పెన్ పవర్:** తెలంగాణ ప్రభుత్వం నగర, పట్టణ వాసులకు శుభవార్త చెప్పింది. జీహెచ్ఎంసీ పరిధిలో మాదిరిగా కార్పొరేషన్లు, మున్సిపాలిటీల్లో ఆస్తి పన్ను చెల్లింపులపై భారీ రాయితీని ప్రకటించింది. 90 శాతం వడ్డీ మాఫీతో ఒకేసారి పన్ను బకాయిలు చెల్లించుకునే అవకాశం కల్పించింది. గృహ వినియోగదారులకు తెలుగు రాష్ట్ర ప్రభుత్వాలు ఆస్తి పన్ను చెల్లింపులకు భారీ రాయితీని ప్రకటించింది. ఏపీలో 50 శాతం కాగా, తెలంగాణ 90శాతం వరకు ఆఫర్ ఇచ్చింది. తెలంగాణలో అన్ని కార్పొరేషన్లు, మున్సిపాలిటీ వాసులకు శుభవార్త. ఆస్తి పన్ను బకాయిలను క్లియర్ చేయడానికి వన్ టైమ్ స్కీమ్ ప్రకటించింది. 2024-25 ఏడాదికి 90 శాతం వడ్డీ మాఫీతో ఒకేసారి పన్ను బకాయిలు చెల్లించుకునే ఛాన్స్ కల్పించింది. ఈ పద్ధతి ఇప్పటివరకు గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో మాత్రమే అమలు చేస్తోంది. ఈ అవకాశ ఇక అన్ని మున్సిపాలిటీలు, కార్పొరేషన్లకు వర్తింపజేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. వన్ టైమ్ సెటిల్‌మెంట్ కింద ఆస్తి పన్నుపై 90 శాతం బకాయి వడ్డీని మాఫీ చేయనుంది. మార్చి 31 వరకు ఆస్తి పన్నుతోపాటు వడ్డీ కేవలం 10 శాతం చెల్లించే వారికి ఈ నిర్ణయం వర్తిస్తుందని ఆదేశాల్లో పేర్కొంది. జీహెచ్ఎంసీ తరహాలో అన్ని కార్పొరేషన్లు, మున్సిపాలిటీల్లో ఆస్తి పన్నుపై 90 శాతం బకాయి వడ్డీని మాఫీ చేసే అవకాశాన్ని కల్పిస్తూ మునిసిపల్ అడ్మినిస్ట్రేషన్-అర్బన్ డెవలప్‌మెంట్ శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. ఈ అవకాశాన్ని గృహ వినియోగదారులు ఉపయోగించుకోవాలని కోరింది. గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో ఓటీఎస్ స్కీమ్ అమల్లో ఉంది. చాలామంది ఈ అవకాశాన్ని ఉపయోగించుకుంటున్నారు. ఆపై పన్నులు చెల్లిస్తున్నారు కూడా. గతేడాది ఓటీఎస్ స్కీమ్‌ను తీసుకొచ్చింది ప్రభుత్వం. దీనివల్ల ఎంతో మంది ఆస్తి పన్ను చెల్లించేందుకు ముందుకొచ్చారు. ఈ విషయాన్ని అధికారులు గుర్తు చేస్తున్నారు. ఈసారీ సిటీ ప్రజల నుంచి మాంచి స్పందన వస్తోందని చెబుతున్నారు. మరోవైపు ఆంధ్రప్రదేశ్‌లో కూటమి సర్కార్ ఆస్తి పన్ను బకాయి దారులకు శుభవార్త చెప్పింది. ఏపీ వ్యాప్తంగా కార్పొరేషన్లు, మున్సిపాల్టీలు, నగర పంచాయతీల పరిధిలోని భవనాలకు ఆస్తి పన్నుతోపాటు పాత బకాయిలపై వడ్డీని 50 శాతం మాఫీ చేస్తున్నట్లు ప్రకటించింది. ఖాళీ స్థలాలకు సైతం ఇది వర్తించనుంది. 2024-25 సంవత్సరానికి చెల్లించాల్సిన వడ్డీ, బకాయిలు 50 శాతం మార్చి 31లోగా చెల్లించేవారికి మాత్రమే ఈ స్కీమ్ వర్తించనుది. ఈ మేరకు ఏపీ పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ ముఖ్య కార్యదర్శి మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. ప్రజల నుంచి వచ్చిన విజ్ఞప్తులు మేరకు కోట్ల రూపాయల ఆస్తి పన్ను బకాయిల వసూళ్ల కోసం రాయితీ నిర్ణయం తీసుకున్నట్టు ప్రభుత్వం వెల్లడించింది. ఈ అవకాశాన్ని గృహ వినియోగదారులు సద్వినియోగం చేసుకోవాలని సూచించింది.

# ఉన్నత స్థాయికి చేరుకోవడమే లక్ష్యంగా కృషి చేయాలి.....

- జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్
- ఆర్థికంగా బలోపేతం కావడం మహిళలకు కీలకం
- గిరిజన సంక్షేమ బాలికల గురుకుల డిగ్రీ కళాశాలలో నిర్వహిస్తున్న జాబ్ మేళా కార్యక్రమంలో పాల్గొన్న జిల్లా కలెక్టర్

**హైదరాబాద్ పెన్ పవర్:** మనం ఎన్నుకున్న రంగంలో అత్యున్నత స్థాయికి ఎదగడమే లక్ష్యంగా కృషి చేయాలని జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ అన్నారు. బుధవారం తనికెళ్ళలోని తెలంగాణ గిరిజన సంక్షేమ బాలికల గురుకుల డిగ్రీ కళాశాలలో జిల్లా ఉపాధి అధికారి కార్యాలయ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న జాబ్ మేళా కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ పాల్గొన్నారు.

ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రపంచ వ్యాప్తంగా మహిళల పట్ల చిన్న చూపు ఉన్న దశలో ఎలాంటి చర్చ లేకుండానే మహిళలకు ఓటు హక్కును మన భారత దేశం కల్పించిందని అన్నారు. ఆర్థికంగా బలోపేతం కాక పోవడమే మహిళల పట్ల ఉన్న వివక్షకు కారణమని గమనించిన ప్రభుత్వం ఇందిరా మహిళా శక్తి కార్యక్రమం అమలు ప్రారంభించిందని అన్నారు. చదువులో బాలుర కంటే అధికంగా బాలికలు రాణిస్తున్నారని కలెక్టర్ తెలిపారు. ఆడపిల్ల పుడితే గర్వ కారణం అని చాటి చెప్పేందుకు జిల్లాలో గర్ల్ ప్రైడ్× అనే వినూత్న కార్యక్రమం ప్రారంభిస్తున్నామని, జిల్లాలో ఎక్కడ ఆడపిల్ల పుట్టినా జిల్లా అధికారి స్వీట్ బాక్స్ తో వెళ్ళి ఆ కుటుంబానికి శుభాకాంక్షలు తెలుపడం జరుగుతుందని అన్నారు. ప్రస్తుతం సంక్షేమ హాస్టల్లో ఉన్న బాలికలకు అధిక బాధ్యత ఉందని, మిమ్మల్ని ఆదర్శంగా తీసుకునేందుకు చాలామంది ఎదురు చూస్తున్నారని, మీరు రాణించి అందుబాటులో ఉన్న అవకాశాలను వినియోగించుకొని ఉన్నత స్థాయికి చేరుకొని నలుగురికి ఆదర్శం కావాలని కలెక్టర్ తెలిపారు. గత తరాల మహిళలకు చదువుకునేందుకు అవకాశాలు లభించలేదని, తన అమ్మమ్మ పెళ్లి తర్వాత చదువుకున్నారని, ప్రస్తుతం తమ కుటుంబం అంతా చదువుకొని మంచి స్థానంలో ఉండేందుకు అమ్మమ్మ కారణమని, తన భార్య కూడా యూపిఎస్సి రాసి ఢిల్లీలో ఉన్నత బాధ్యతలో ఉన్నారని కలెక్టర్ తెలిపారు. ఎన్నికల సమయంలో మహిళలకు ధైర్యం కల్పించి ఎన్నికల విధులు కేటాయిస్తే చిత్తశుద్ధితో నిర్వహించి నాలుగు కోట్ల నగదు, మద్యం, బంగారం జప్తు చేసి పారదర్శకంగా ఎన్నికల నిర్వహణలో కీలకమైన పాత్ర పోషించారని కలెక్టర్ తెలిపారు. మహిళలకు చేయలేని పని అంటూ ఏదీ ఉండదని, మనలో ఉన్న సామర్థ్యంపై నమ్మకం పెంచుకోవాలని అన్నారు. మన జీవితంలో ధైర్యం చేస్తేనే పైకి ఎదుగుతామని, ఇతరుల మాటలు పట్టుకుంటే ఏమీ సాధించలేమని అన్నారు. ప్రతి రంగంలో ఉన్నత స్థాయికి చేరుకోవాలనే లక్ష్యాన్ని ప్రతి మహిళ నిర్దేశించుకోవాలని అన్నారు.

ఖమ్మం జిల్లా ప్రభుత్వ విద్యా సంస్థలలో ఉత్తమమైన ప్రతిభ కలిగిన విద్యార్థినులు ఉన్నారని, వీరికి ప్రైవేట్ కంపెనీలోఅవకాశం కల్పిస్తే తప్పనిసరిగా రాణిస్తారని, కంపెనీలకు విశ్వాసంగా ఉంటూ వాటి అభివృద్ధికి చిత్తశుద్ధితో కృషి చేస్తారని కలెక్టర్ తెలిపారు.

చిన్నతనంలో 7వ తరగతి చదివే సమయంలో విజయలక్ష్మి మేడం అనే టీచర్ బోధన పద్ధతులు మార్చి తనపై తీసుకున్న శ్రద్ధ కారణంగానే తాను నేడు కలెక్టర్ స్థాయికి చేరుకున్నానని అన్నారు. టీచర్ల విలువ ఎప్పటికీ మర్చిపోవద్దని, వారి శ్రమ ఫలితం వృధా కాకుండా ప్రతి ఒక్కరూ ఉన్నత స్థాయికి చేరుకోవాలని కలెక్టర్ ఆకాంక్షించారు. జీవితంలో ఉన్నత స్థాయికి చేరుకున్న తర్వాత మనం మరో నలుగురికి సహాయం చేయాలని, సమాజంలో ఇతరుల అభివృద్ధికి మనం తోడ్పాటు అందిస్తే వచ్చే సంతృప్తి మరో కార్యక్రమంలో ఉండదని కలెక్టర్ తెలిపారు. జిల్లా ఉపాధి అధికారి ఎన్. మాధవి మాట్లాడుతూ మా పాప మా ఇంటి మణి దీపం అనే కార్యక్రమాన్ని జిల్లాలో ప్రారంభించడం చాలా సంతోషంగా ఉందని అన్నారు. చదువు మాత్రమే మనల్ని కాపాడుతుందని, ఈ అంశం ప్రతి మహిళ గుర్తుంచుకోవాలని అన్నారు. ప్రస్తుత జాబ్ మేళాలో మనకు వచ్చేది మొదటి అవకాశం మాత్రమేనని, హైదరాబాద్, బేంగళూరు వంటి నగరాల్లో అనేక అవకాశాలు వస్తాయని, మన ప్రతిభను ఎప్పటికప్పుడు అప్డేట్ చేసుకుంటూ ఉన్నత స్థాయికి ఎదగాలని అన్నారు. అనంతరం జిల్లా కలెక్టర్ ఇంటర్వ్యూ ప్రక్రియను పరిశీలించారు. అంతకు ముందు ప్రిన్సిపాల్ చాంబర్ లో జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ గురుకులం నిర్వహణ, అభివృద్ధి పనులపై సమీక్షించారు. జాబ్ మేళాలో వచ్చిన కంపెనీలు, ఉపాధి అవకాశాల గురించి చర్చించారు. జాబ్ మేళాలో ఎంపికైన మహిళలకు ఫైనాన్షియల్ ప్లానింగ్ పై శిక్షణ అందించాలని అన్నారు. మహిళలకు ఆర్థిక స్వావలంబన చాలా ముఖ్యమని అన్నారు. ప్రస్తుతం వచ్చే జాబ్స్ ఎలా ఉంటాయ్, భవిష్యత్తులో ఎటువంటి అవకాశాలు వస్తాయి, ఎటువంటి కోర్సులు నేర్చుకోవాలి, రాబోయే రోజుల్లో మరో డీగ్రీ ఎలా పొందాలి వంటి అంశాలను ప్లాన్ చేసుకునేలా మహిళలను సిద్ధం చేయాలని కలెక్టర్ తెలిపారు. గురుకుల హాస్టల్ లో ఫర్నిచర్, బుక్స్ కోసం ప్రతిపాదనలు అందించాలని అన్నారు. మార్చి లోపు గ్రౌండ్ చేసేందుకు ఆస్కారం ఉన్న ప్రతిపాదనలు మాత్రమే పంపాలని అన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఏ. రజిత, ఉపాధ్యాయులు, కంపెనీ ప్రతినిధులు, విద్యార్థినులు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ఎంఎంటీఎస్ రైలు అత్యాచారయత్నం, ఉప ఎన్నికల అంశంపై స్పందించిన రేవంత్ రెడ్డి

- అత్యాచారయత్నం ఘటనపై వెంటనే స్పందించామన్న ముఖ్యమంత్రి
- బీఆర్ఎస్ హయాంలో దిశ ఘటన, వామనరావు దంపతుల హత్య జరిగిందని గుర్తు చేసిన సీఎం
- ఉప ఎన్నికలు రాబోవని తేల్చి చెప్పిన రేవంత్ రెడ్డి



**హైదరాబాద్ పెన్ పవర్:**ఎంఎంటీఎస్ రైలులో జరిగిన అత్యాచారయత్నం ఘటనపై ప్రభుత్వం వెంటనే స్పందించిందని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. శాసనసభలో ఆయన మాట్లాడుతూ, ఈ ఘటనను చూపిస్తూ బీఆర్ఎస్ తమ ప్రభుత్వంపై దుష్ప్రచారం చేస్తోందని మండిపడ్డారు. రాష్ట్రానికి పెట్టుబడులు రాకుండా అడ్డుకోవాలని చూస్తున్నారని ఆరోపించారు. అయితే, ఈ ఘటనపై ప్రభుత్వం వెంటనే స్పందించిందని ఆయన స్పష్టం చేశారు.

గత బీఆర్ఎస్ హయాంలో దిశ ఘటన జరిగిందని, వామనరావు దంపతులను నడిరోడ్డుపై నరికి చంపారని గుర్తు చేశారు. అప్పుడు బీఆర్ఎస్ ప్రభుత్వం పట్టించుకోలేదని ఆరోపించారు. జూబ్లీహిల్స్ అత్యాచారం కేసులో బీఆర్ఎస్ నాయకుడి కుమారుడు ఉన్నప్పటికీ చర్యలు తీసుకోలేదని విమర్శించారు. యువతను వ్యసనాలకు బానిస చేసిన ఘనత గత ప్రభుత్వానిదేనని ఆయన దుయ్యబట్టారు.

**ఆ భూమిని స్వాధీనం చేసుకున్నాం**

గచ్చిబౌలిలో ఉన్న 400 ఎకరాల భూమిని దాదాపు పాతిక సంవత్సరాల క్రితం బిల్లారావు అనే ప్రైవేటు వ్యక్తికి, ఆయన సంస్థకు నాటి ప్రభుత్వం ఆ భూమిని కేటాయించిందని, అప్పటి నుంచి హెచ్‌సీయూ వద్ద ఆ భూమి లేదని ముఖ్యమంత్రి తెలిపారు. 2006లో నాటి కాంగ్రెస్ ప్రభుత్వం ఆ భూకేటాయింపులను రద్దు చేసిందని ఆయన వెల్లడించారు. అప్పటి నుంచి ఈ వ్యవహారం కోర్టు పరిధిలో ఉందని తెలిపారు.

బీఆర్ఎస్ ప్రభుత్వం పదేళ్ల కాలంలో ఆ భూమిని దక్కించుకునే ప్రయత్నాలు చేయలేదని, తాము అధికారంలోకి వచ్చాక సుప్రీంకోర్టుకు వెళ్లి ఆ భూమిని స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. ప్రస్తుతం ఆ భూమిని రాష్ట్ర అభివృద్ధి కోసం వినియోగిస్తున్నామని వెల్లడించారు. అభివృద్ధికి కేటాయించిన భూమిలో రిజర్వ్ ఫారెస్ట్ ఉన్నట్లు, అందులో జీవరాశులు ఉన్నట్లు రాద్ధాంతం చేస్తున్నారని మండిపడ్డారు. అక్కడ పులులు, సింహాలేమీ లేవని, కొన్ని గుంటనక్కలు ఆ భూమి చుట్టూ చేరి రాద్ధాంతం చేస్తున్నాయని విమర్శించారు. ఆ భూమిని అభివృద్ధి కోసమే వినియోగిస్తామని స్పష్టం చేశారు.

**ఉప ఎన్నికలు రాబోవు**

తెలంగాణలో ఉప ఎన్నికలు వస్తాయని కొందరు ప్రచారం చేస్తున్నారని, కానీ అలాంటిదేమీ ఉండదని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. ప్రజాప్రతినిధులెవరికీ ఉప ఎన్నికలు వస్తాయనే ఆందోళన అవసరం లేదని తెలిపారు. ఇలాంటి అంశాల మీద దృష్టి సారించకుండా ప్రజా సమస్యలపై పని చేయాలని హితవు పలికారు. తాను రాష్ట్ర అభివృద్ధిపై దృష్టి సారించానని ముఖ్యమంత్రి అన్నారు. ఎమ్మెల్యేలు పార్టీ మారిన అంశం సుప్రీంకోర్టు పరిధిలో ఉందని, తాము అన్నింటికీ సిద్ధంగా ఉన్నామని తెలిపారు.

# జమిలీ ఎన్నికలపై సీఎం రేవంత్ కీలక వ్యాఖ్యలు



**హైదరాబాద్ పెన్ పవర్:**జమిలీ ఎన్నికలపై సీఎం రేవంత్ కీలక వ్యాఖ్యలు చేశారు. షెడ్యూల్ ప్రకారమే ఎన్నికలు జరుగుతాయన్నారు. లోక్ సభ ఎన్నికలు 2029లోనే జరుగుతాయన్నారు . కేంద్రం జమిలీ ఎన్నికలు జరిపితే 2028లో జరగాల్సిన అసెంబ్లీ ఎన్నికలు 2029లో జరుగుతాయి... అపుడు అసెంబ్లీ టర్మ్ ను మరో 6 నెలల పొడిగించే అవకాశం ఉందన్నారు. ఈ నాలుగేళ్లలో తెలంగాణను అభివృద్ధి చేసుకుందామన్నారు రేవంత్. తాను రాజకీయాలు చూడనని..తన దగ్గరకు ఏ పార్టీ ఎమ్మెల్యే వచ్చినా సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని చెప్పారు సీఎం రేవంత్. హరీశ్ రావు వచ్చినా..కేసీఆర్ వచ్చినా ఒక సీఎంగా వాళ్ల నియోజకవర్గాల సమస్యలు పరిష్కరిస్తానని చెప్పారు రేవంత్.

**ఉప ఎన్నికలు రావు**

మరో వైపు తెలంగాణలో పార్టీ ఫిరాయింపులపై కూడా సీఎం రేవంత్ కీలక వ్యాఖ్యలు చేశారు. మార్చి 26న అసెంబ్లీలో మాట్లాడిన రేవంత్..పార్టీ ఫిరాయింపులపై బీఆర్ఎస్ నేతలు గగ్గోలు పెడుతున్నారు. ప్రతిరోజు ఉప ఎన్నికలు వస్తాయని ప్రచారం చెబుతున్నారు. 2014 నుంచి 2024 వరకు రాష్ట్రంలో ఎలాంటి సంప్రదాయం ఉందో అదే సంప్రదాయాన్ని మేం ఫాలో అవుతున్నాం. . పార్టీ మారిన ఎమ్మెల్యేలకు బీఆర్ఎస్ మంత్రి పదవులు ఇచ్చింది. మేం ఎలాంటి పదవులు ఇవ్వడం లేదు. వాళ్ల అడుగుజాడల్లో మేం నడవడం లేదు. ప్రతి రోజు ఉప ఎన్నికలు వస్తాయని ప్రచారం చేస్తున్నారు. ఫిరాయింపుల అంశం కోర్టు పరిధిలో ఉంది. తెలంగాణలో ఎలాంటి ఉప ఎన్నికలు రావు.. ఎమ్మెల్యేలు ఆందోళన చెందాల్సిన అవసరం లేదు.మా దృష్టి ఉప ఎన్నికలపై లేదు..అభివృద్ధిపైనే ఉంది. అని రేవంత్ అన్నారు.

# సీఎం రేవంత్ ను కలిసిన బీఆర్ఎస్ ఎమ్మెల్యే



**హైదరాబాద్ పెన్ పవర్:**కూకట్ పల్లి బీఆర్ఎస్ ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు సీఎం రేవంత్ రెడ్డిని కలిశారు. కూకట్ పల్లి నియోజకవర్గంలోని పలు సమస్యల పరిష్కారానికి వెంటనే నిధులు మంజూరు చేయాలని అసెంబ్లీల ఛాంబర్లో సీఎం రేవంత్ ను కలిసి వినతి పత్రాన్ని అందజేశారు. నూతన రోడ్ల నిర్మాణం, మురుగునీటి వ్యవస్థ, తాగునీటి నూతన పైప్ లైన్ ల నిర్మాణం, పార్కులు, శ్మశాన వాటికల నిర్మాణం (మిగిలిన పనులకు) సుమారుగా రూ. 25-30 కోట్ల రూపాయల నిధులను మంజూరు చేయాలని కోరారు. అదే విధంగా కూకట్పల్లి మండలం పరిధిలోని హైదర్ నగర్ గ్రామం సర్వే నెంబర్ 145,163 లలో నిర్మాణ అనుమతులను నిలిపివేసి స్థానికులను ఇబ్బందులకు గురిచేస్తున్నారని, దశాబ్దాల కాలంగా ఏ పార్టీ అధికారంలో ఉన్నా గానీ ప్రభుత్వపరమైన అన్ని అనుమతులను జారీ చేశార చెప్పారు. ఇటీవల కాలంలో అకస్మాత్తుగా నిర్మాణ అనుమతులను నిలిపివేశారని సీఎం దృష్టికి తీసుకువెళ్లారు. అదే విధంగా జేఎన్టీయూ వెనుక ఉన్న సాయి నగర్ కాలనీ వాసుల ఇళ్ల స్థలాల రెగ్యులరైజేషన్ విషయంలో ప్రభుత్వం దృష్టి సారించాలని కోరారు కృష్ణారావు. 2014 కు ముందు ప్రభుత్వం నిర్ణయించిన ధరల మేరకు డబ్బులు చెల్లించేందుకు కాలనీ వాసులు సిద్ధంగా ఉన్నారని వారికి న్యాయం చేయాలని కోరారు. అన్ని విషయాలను వివరంగా తెలుసుకున్న సీఎం రేవంత్ వినతి పత్రాలను సంబంధిత అధికారులకు పంపిస్తానని త్వరలోనే పరిష్కారం చూపుతానని హామీ ఇచ్చారు.

## భద్రాదిలో ఘోర ప్రమాదం.. ఒక్కసారిగా కుప్పకూలిన 6 అంతస్తుల భవనం

**హైదరాబాద్ పెన్ పవర్:**భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో ఘోర ప్రమాదం జరిగింది. భద్రాచలం పట్టణంలోని పోకల బజార్?లో నిర్మాణంలో ఉన్న ఆరంతస్తుల భవనం ఒక్కసారిగా కుప్పకూలింది. భవన నిర్మాణ కార్మికులు శిథిలాల కింద చిక్కుకున్నట్లు తెలుస్తోంది. స్థానికుల ద్వారా సమాచారం అందుకున్న పోలీసులు హుటాహుటిన ఘటన స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. శిథిలాల కింద చిక్కుకున్న కార్మికులను బయటకు తీసుకొచ్చేందుకు తీవ్రంగా శ్రమిస్తున్నారు. ఈ ఘటనలో ఆరుగురు కార్మికులు మృతి చెందినట్లు సమాచారం. కాగా, ప్రమాదానికి గురైన భవనం అనుమతులు లేకుండా నిర్మిస్తున్నారు. జీ ప్లస్ టూకు మాత్రమే పర్మిషన్ ఉండగా.. అంతకుమించి ఎత్తున నిర్మాణం చేపడుతుండటంతో గతంలోనే ఈవో భవన నిర్మాణ పనులను నిలిపివేశారు. అధికారులు అనుమతి నిరాకరించినప్పటికీ.. అలాగే పనులు కంటిన్యూ చేస్తున్నారు ఇంటి యజమానులు. ఈ క్రమంలోనే బుధవారం (మార్చి 26) గ్రౌండ్ ఫ్లోర్?లో పిల్లర్లు సరి చేస్తుండగా ఒక్కసారిగా భవనం కుప్పకూలింది.దీంతో కార్మికులు భవన శిథిలాల కింద చిక్కుకుపోయారు. ఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు, రెవిన్యూ, పంచాయతీ రాజ్ అధికారులు రెస్క్యూ ఆపరేషన్ చేపట్టారు. సహాయక చర్యల కోసం ఐటీసీ నుంచి ప్రొక్లెయిన్లు, క్రేన్లను రప్పించారు. నిర్మాణంలో లోపం వల్లే భవనల నేలమట్టం అయిందని అధికారులు ప్రాథమికంగా నిర్ధారించారు. ఈ ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

## ఐపీఎల్ ఫ్యాన్స్‌కు గుడ్ న్యూస్.. ఉప్పల్ స్టేడియానికి స్పెషల్ బస్సులు..



హైదరాబాద్ పెన్ పవర్:ఐపీఎల్ వచ్చిందంటేనే క్రికెట్ ఫ్యాన్స్ హంగామా చేస్తుంటారు. ఇక మన హైదరాబాద్ ఉప్పల్ స్టేడియంలో మ్యాచ్ ఉందంటే ఫ్యాన్స్ హంగామా అంతా ఇంతా కాదు. స్టేడియానికి వెళ్లి మరీ మ్యాచ్ చూసి ఎంజాయ్ చేస్తారు. దీంతో మ్యాచ్ రోజున హైదరాబాద్ భారీగా ట్రాఫిక్ జామ్ అవుతోంది. ఈ ట్రాఫిక్ ను ఉద్దేశించి తెలంగాణ ఆర్టీసీ కీలక నిర్ణయం తీసుకుంది. ఉప్పల్ స్టేడియంలో జరిగే మ్యాచ్ లకోసం హైదరాబాద్ లో స్పెషల్ బస్సులను నడపనున్నట్లు ప్రకటించింది. మొత్తం 24 రూట్లలో ఈ బస్సులు నడవనున్నాయి.

ఐపీఎల్ కు వచ్చే ఫ్యాన్స్ కి ఇబ్బందులు కలగకుండా ఆర్టీసీ బస్సులను పలు హైదరాబాద్ లోని ప్రాంతాల నుంచి ఉప్పల్ స్టేడియానికి ఆపరేట్ చేయనున్నట్లు వెల్లడించారు గ్రేటర్ హైదరాబాద్ ఆర్టీసీ అధికారులు. గ్రేటర్ పరిధిలోని 24 డిపోల నుంచి 60 స్పెషల్ బస్సులను ఆపరేట్ చేయనున్నారు. ఐపీఎల్ మ్యాచ్ లు జరగనున్న తేదీల్లో ఈ ప్రత్యేక బస్ సర్వీసులు అందుబాటులో ఉండనున్నాయి. మార్చి 27, ఏప్రిల్ 6 ,ఏప్రిల్ 12, ఏప్రిల్ 23, మే 5, మే 10, మే 20, మే 21 తేదీల్లో జరగనున్న ఐపీఎల్ మ్యాచ్ లకు ఈ ప్రత్యేక ఆర్టీసీ సర్వీసులను అరేంజ్ చేసినట్లు అధికారులు వెల్లడించారు ప్రధానంగా ఘట్ కేసర్, హయత్ నగర్ ఎన్జీవోస్ కాలనీ ,ఎల్బీనగర్, కోటి, లకిడికపూల్, దిల్ సుఖ్ నగర్, మేడ్చల్, కేపీహెచ్ బీ, మియాపూర్ జేబీఎస్ ఈసీఐఎల్ బోయిన్ పల్లి, చార్మినార్, చాంద్రాయణగుట్ట, మెహదీపట్నం, బీహెచ్ఈఎల్ వంటి వివిధ ప్రాంతాల నుంచి ఉప్పల్ స్టేడియానికి ఈ స్పెషల్ బస్సులు నడుస్తాయి.

## సబ్ క యోజన -సబ్ క వికాస్ ప్రణాళికలు రూపొందించాలి

### జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ

హైదరాబాద్ పెన్ పవర్:జిల్లాలో సమగ్ర ప్రణాళికా అమలుకు సంబంధించి "సబ్ క యోజన - సబ్ కి వికాస్" కింద జిల్లా, మండల ప్రణాళికలు రూపొందించాలని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ తెలిపారు. బుధవారం ఐడిఓసి కార్యాలయంలో సబ్ కి యోజన - సబ్ కి వికాస్" కింద జిల్లా, మండల ప్రణాళికలు రూపకల్పనపై జిల్లా స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ అధికారులకు ప్రణాళికలు రూపకల్పనపై పలు సూచనలు చేశారు.

ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, జిల్లా మరియు మండల స్థాయిలో ప్రణాళికా రూపకల్పన ఎంతో కీలకమైనదని, ఇందులో ప్రజల అవసరాలను దృష్టిలో ఉంచుకుని సమర్థవంతమైన అభివృద్ధి చర్యలు చేపట్టాలని సూచించారు. గ్రామ, మండల స్థాయిలో ప్రజా భాగస్వామ్యాన్ని పెంచి ప్రణాళికలను రూపొందించాల్సిన అవసరాన్ని ఆయన పేర్కొన్నారు. అంతేకాక, అభివృద్ధి ప్రణాళికల రూపకల్పనలో ఆయా ప్రణాళికలు సమగ్ర అభివృద్ధిని లక్ష్యంగా ఉంచుకుని రూపొందించాల్సిన అవసరం ఉందని కలెక్టర్ తెలిపారు. ప్రతి మండలానికి ప్రత్యేక ప్రణాళిక రూపొందించి, స్థానిక వనరులను సమర్థవంతంగా ఉపయోగించుకోవడం ద్వారా అభివృద్ధిని వేగవంతం చేయడానికి అవకాశం కలుగుతుందని తెలిపారు.

ఈ సమావేశంలో అదనపు కలెక్టర్లు అశోక్ కుమార్, విజయలక్ష్మి , సబ్ కలెక్టర్ మయాంక్ సింగ్, డిపిఓ నారాయణరావు, డిఆర్డీఓ నరేష్, ఇతర శాఖల జిల్లా అధికారులు, అన్ని మండలాల తహసీల్దార్లు, ఎంపిడిఓలు , ఎంపీవోలు తదితరులు పాల్గొన్నారు.

# షష్టగ్రహ కూటమికి ముందు ఇలా:దక్షిణ కొరియాలో తగలబడుతున్న ఊర్లకుఊర్లు



హైదరాబాద్ పెన్ పవర్:దక్షిణ కొరియాలో కార్చిచ్చు విధ్వంసం సృష్టించింది.చరిత్రలో కనీవినీ ఎరుగని వినాశనంతో దక్షిణ కొరియా విలవిలలాడుతోంది.దేశ దక్షిణ ప్రాంతమంతా మంటల్లో చిక్కుకుపోయింది. ఇల్లు, ఫ్యాక్టరీలు, స్కూళ్లు, దేవాలయాలు అన్నీ మంటల్లో కాలి బూడిదయ్యాయి. 24 మంది సజీవ దహనమయ్యారు. దాదాపు 27వేల మంది నిరాశ్రయిలయ్యారు. శతాబ్దాల చరిత్రగల రాజభవనాలు, బ్రిడ్జీలు ఆనవాళ్లు లేకుండా పోయాయి.దాదాపు 50వేల ఎకరాల అడవి మంటల్లో దహనమయ్యింది. దక్షిణ కొరియా చరిత్రలో అతిపెద్ద కార్చిచ్చు ఇది.

దక్షిణ కొరియాలో కార్చిచ్చుతో కాండవ దహనం చేసింది. భారీఎత్తున ఈదురు గాలుల తోడు కావడంతో మంటలు చెలరేగాయి. ఇళ్లు, కర్మాగారాలు, పురాతన బౌద్ధ దేవాలయం సహ 200 కి పైగా నిర్మాణాలను మంటల్లో కాలి బూడిదయ్యాయని జాతీయ అగ్నిమాపక సంస్థ బుధవారం(మార్చి26) ధృవీకరించింది.

వైల్డ్ ఫైర్ లో ఉయిసోంగ్ ప్రాంతమంతా మాడి మసిఅయ్యింది. ఆ ప్రాంతమంతా మండే అగ్ని గోళంగా మారింది. అగ్ని ప్రమాదంలో మొత్తం 24 మంది సజీవదహనమయ్యారు. వారిలో నలుగురు ఫైర్ సిబ్బంది కూడా ఉన్నారు. కార్చిచ్చు మంటలార్పుతున్న సమయంలో ఓ హెలికాప్టర్ మంటల్లో కూలిపోయి ఓ పైలట్ కూడా మృతిచెందాడు.శాంచియోంగ్‌లో వేగంగా విస్తరించిన మంటల కారణంగా ప్రభుత్వ ఉద్యోగులు కూడా ప్రాణాల కోల్పోయారు. మరో 26మంది తీవ్రంగా గాయపడ్డారు. దక్షిణకొరియోలోని దక్షిణ ప్రాంతమైన గౌన్సాలో కూడా కార్చిచ్చు బీభత్సం సృష్టించింది. వేలాది మంది నిరాశ్రయులయ్యారు. 7వ శతాబ్దం నాటి బౌద్ధ దేవాలయం, దాని చుట్టూ నిర్మాణాలు మంటల్లో ఆనవాళ్లు లేకుండా పోయాయి. వాటిలో గుర్తింపు పొందిన 1668 లో వాగుపై నిర్మించిన పెవిలియన్ ఆకారపు నిర్మాణం, 1904లో రాజు జోసెయోన్ రాజవంశం భవనం కూడా ఉన్నాయి.

సహాయక చర్యలు.. సౌత్ కొరియా చరిత్రలో ఎప్పుడూ లేనంతగా కార్చిచ్చు సృష్టించిన విధ్వంసానికి అక్కడి ప్రభుత్వం దిగ్భ్రాంతికి గురయింది. సైనికులు, ఎమర్జెన్సీ సిబ్బందితో సహాయక చర్యలు చేపట్టింది. కార్చిచ్చు చెలరేగిన ప్రాంతాల్లో ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలిస్తోంది. 130 హెలికాప్టర్లతో దాదాపు 5వేల ఫైర్ సిబ్బంది, ఆర్మీ, ఎమర్జెన్సీ టీంలతో సహాయక చర్యలు ముమ్మరం చేసింది. రాత్రిపూట బలమైన ఈదురు గాలులతో మంటల తీవ్రతరం అవుతుండటంతో సహాయక చర్యలకు ఆటంకం కలుగుతోంది. ఈ కార్చిచ్చుతో దక్షిణ కొరియాకు తీరని నష్టం వాటిల్లిందని తాత్కాలిక అధ్యక్షుడు హాన్ డక్ ప్రకటించారు.

**వైల్డ్ ఫైర్ కు కారణం..**

ఈ కార్చిచ్చులకు ఖచ్చితమైన కారణాలను ఇంకా తెలిసి రానప్పటికీ మానవ తప్పిదం ఇది జరిగి ఉండొచ్చని అక్కడి అధికారులు అనుమానిస్తున్నారు. స్థానికంగా ఓ సమాధికి సంబంధించిన పనుల్లో వెల్డింగ్ స్పార్క్‌ల వల్ల మంటలు చెలరేగి ఉండవచ్చని అధికారులు భావిస్తున్నారు.మొన్నటికి మొన్న అమెరికాలోని కాలిఫోర్నియా, లాస్ ఏంజిల్స్ మొత్తం తగలబడిన విషయం తెలిసిందే. వేలాది ఇళ్లు కాలి బూడిదయ్యాయి..లక్షల కోట్లు నష్టం వచ్చింది. ఈ ఘటన మరిచిపోకముందే.. ఇప్పుడు దక్షిణ కొరియాలో కార్చిచ్చు మొదలైంది. ఊర్లకు ఊర్లు.. గ్రామాలకు గ్రామాలు తగలబడుతున్నాయి. ప్రతి ఇల్లు ఓ నిప్పుల కుంపటి అయ్యింది. రాబోయే నాలుగు రోజుల్లో ప్రకృతి పరంగా షష్టగ్రహ కూటమి ఏర్పడుతుందని..ఈ కూటమి ప్రభావం ప్రపంచవ్యాప్తంగా ఉంటుందని జ్యోతిష్య పండితులు పలువురు..కొన్ని నెలలుగా హెచ్చరిస్తున్నారు. ఆ కొంత మంది చెప్పినట్లు..కొందరు జ్యోతిష్య పండితులు చెప్పినట్లు..షష్ట గ్రహ కూటమి ఏర్పాటుకు 4 రోజుల ముందు..ఇలా దక్షిణ కొరియాలో కార్చిచ్చు రావటం చర్చనీయాంశం అయ్యింది. ఈ ప్రకృతి విపత్తు షష్ట గ్రహ కూటమి వల్లనేనా అనే చర్చ సోషల్ మీడియాలో జోరుగా సాగుతుంది.

# హైదరాబాద్‌లో చైనా ఎలక్ట్రిక్ కార్ల కంపెనీ.. 70వేల కోట్లతో మాన్యుఫ్యాక్చరింగ్ యూనిట్!




హైదరాబాద్ పెన్ పవర్:హైదరాబాద్ ఎలక్ట్రిక్ వాహనాల(EV) తయారీకి హబ్‌గా మారుతోంది. చైనాకు చెందిన ప్రముఖ ఎలక్ట్రిక్ కార్ల తయారీ కంపెనీ BYD హైదరాబాద్ పరిసర ప్రాంతాల్లో కొత్త ఈవీ కార్ల తయారీ కంపెనీ ఏర్పాటు చేయనున్నట్లు తెలుస్తోంది. దాదాపు 70వేల కోట్ల పెట్టుబడితో హైదరాబాద్ సిటీ సమీపంలో మాన్యుఫ్యాక్చరింగ్ యూనిట్ ఏర్పాటు చేయాలని యోచిస్తోంది. ప్రపంచ ఎలక్ట్రిక్ వెహికల్స్ మార్కెట్ లో BYD నంబర్ వన్ గా ఉంది. 2024లో ఈ కంపెనీ 107బిలియన్ డాలర్ల ఆదాయాన్ని చూసింది. ఇది టెస్లా కార్ల కంపెనీ ఆదాయం 97.7 బిలియన్ డాలర్ల కంటే ఎక్కువ.టెస్లా 1.79 మిలియన్ల బ్యాటరీ కార్లను తయారు చేస్తే %దీని% ఎలక్ట్రిక్, హైబ్రిడ్ మోడళ్లతో సహ 4.27 మిలియన్ల వెహికల్స్ ను డెలివరీ చేసింది. MEIL గ్రూప్ కంపెనీ ఒలెక్ట్రా గ్రీన్‌టెక్ ఇప్పటికే BYD టెక్నాలజీని ఉపయోగించి ఎలక్ట్రిక్ బస్సులను ఉత్పత్తి చేస్తోంది. ఇది ఇప్పటికే ఉన్న కనెక్షన్‌ను సూచిస్తుంది.BYD ఈ ప్రాజెక్టు ఓకే అయితే లక్షల్లో ఉద్యోగాలు వచ్చే అవకాశం ఉంది. కొత్త టెక్నాలజీని పరిచయంతో భారతదేశ EV రంగాన్ని బలోపేతం అవుతుంది. ఈ విస్తరణ క్లీనర్ ఎనర్జీ సొల్యూషన్లకు మద్దతు ఇస్తూనే ప్రపంచ మార్కెట్‌లో భారతదేశం స్థానాన్ని మెరుగుపరుస్తుందని భావిస్తున్నారు. అయితే తెలంగాణలో BYD కంపెనీ ప్రతిపాదనను గతంలో కేంద్ర ప్రభుత్వం తిరస్కరించినట్లుగా తెలుస్తోంది. మరోవైపు ఎలక్ట్రిక్ వాహనాలను ప్రోత్సహిస్తూ తెలంగాణ ప్రభుత్వం ఇప్పటికే అనేక రాయితీలు ఇస్తోంది. అన్ని రకాల ఎలక్ట్రిక వాహనాలకు రోడ్డు ట్యాక్స్, రిజిస్ట్రేషన్ ఫీజులను 100శాతం మినహాయింపు అందిస్తోంది. ఇది 2026 డిసెంబర్ 31 వరకు చెల్లుబాటు అవుతుంది.

# వాట్సాప్-గూగుల్ డేటాతో రూ.250 కోట్లు పట్టుకున్న పన్ను అధికారులు.. షాకింగ్

**హైదరాబాద్ పెన్ పవర్:** భారతదేశంలో ఆదాయపు పన్ను అధికారులు టాక్స్ ఎగవేతదారులను కనిపెట్టడానికి కొత్త సాంకేతిక మార్గాలను వినియోగించటం పెద్ద సంచలనం సృష్టిస్తోంది. గతంలో నోటీసులు అందించి దర్యాప్తు చేసిన టాక్స్ అధికారులు, ప్రస్తుతం పక్కా ఆధారాలతోనే టాక్స్ పేయర్స్ ను దర్యాప్తుకు పిలుస్తున్నట్లు తెలుస్తోంది. ఈ క్రమంలో అధికారులు వివిధ ఏఐ సాధనాలను కూడా వాడుతున్నట్లు తేలింది. ఇది పన్ను ఎగవేతకు ప్రయత్నించే వారికి పెద్ద ఎదురుదెబ్బే. వివరాల్లోకి వెళితే కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ తాజాగా కొత్త ఆదాయపు పన్ను చట్టం 2025ను ప్రవేశపెట్టే క్రమంలో సంచలన విషయాలను బయటపెట్టారు. వాస్తవానికి లెక్కల్లో చూపించని నల్లధనాన్ని వెలికితీయటానికి డిజిటల్ ఫోరెన్సిక్స్ కీలక పాత్ర పోషించిందని బిల్లును సమర్థిస్తూ ఆమె సంచలన విషయాలను బయటపెట్టారు. మొబైల్ ఫోన్లలో ఎన్ క్రిప్ట్ చేయబడిన మెసేజ్లను విశ్లేషణ ద్వారా లెక్కల్లో చూపించని రూ. 250 కోట్ల అక్రమ సంపాదనను పన్ను అధికారులు గుర్తించినట్లు ఆమె పేర్కొన్నారు. అలాగే క్రిప్టో కరెన్సీ ఆస్తులకు సంబంధించిన వాట్సాప్ సందేశాల నుంచి దర్యాప్తులో సేకరించిన ఆధారాలు కనుగొన్నట్లు ఆమె బయటపెట్టారు. వాట్సాప్ కమ్యూనికేషన్ రూ. 200 కోట్ల లెక్కల్లో లేని డబ్బును దీని ద్వారా వెలికితీసినట్లు పేర్కొన్నారు. అందువల్లనే కేంద్ర ప్రభుత్వం కొత్త ఆదాయపు పన్ను చట్టం దేశంలోని ప్రజల డిజిటల్ ఫుట్ ప్రింట్స్ పర్యవేక్షించటానికి పన్ను అధికారులకు అవసరమైన అనుమతిని చట్టపరంగా అందిస్తుందని నిర్మలమ్మ వెల్లడించారు. ఈ డబ్బును దాచిపెట్టడానికి నిందితులు తరచుగా ట్రావెల్ చేసిన ప్రదేశాల వివరాలను క్రోడీకరించటానికి గూగుల్ మ్యాప్స్ హిస్టరీని కూడా ఉపయోగించుకున్నట్లు ఆమె వెల్లడించారు. అలాగే బినామీ ఆస్థిని నిరూపించటానికి ఇన్‌స్టాగ్రామ్ ఖాతాలను విశ్లేషించినట్లు చెప్పటం అక్రమార్కులకు ప్రస్తుతం చెమటలు పట్టిస్తోంది. అందువల్ల కొత్త ఆదాయపు పన్ను బిల్లు, 2025 కింద డిజిటల్ ఆస్తులను ట్రాక్ చేయడానికి చట్టపరమైన నిబంధనలను బలోపేతం చేయాలని కేంద్ర ప్రభుత్వం మార్పులు చేస్తున్నట్లు ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ వెల్లడించారు. గతంలో ఉన్న ఆదాయపు పన్ను చట్టాలు ఈ తనిఖీలకు యాక్సెస్ ఇవ్వనందునే దానికి తగినట్లుగా ప్రస్తుతం తెస్తున్న కొత్త చట్టంలో మార్పులను చేసినట్లు ఆమె పేర్కొన్నారు. అక్రమార్కులను అడ్డుకోవటానికి చట్టపరమైన మద్దతు అవసరమనీ లోక్‌సభలో ఆర్థిక బిల్లుపై చర్చకు సమాధానమిస్తూ ఆర్థిక మంత్రి మార్పులను సమర్థించారు. ఇకపై కొత్త ఆదాయపు పన్ను బిల్లు అధికారులకు ప్రజల ఇమెయిల్స్, వాట్సాప్, టెలిగ్రామ్ వంటి కమ్యూనికేషన్ ప్లాట్‌ఫారమ్‌లకు యాక్సెస్ ఇవ్వనుంది. అలాగే ఆర్థిక లావాదేవీలను

దాచడానికి వ్యాపారాలు ఉపయోగించే ఎంటర్‌ప్రైజ్ సాఫ్ట్‌వేర్, స్టోరేజ్ సర్వర్‌లను యాక్సెస్ చేయడానికి అనుమతిని చట్టం కల్పించనుందని తెలుస్తోంది. డిజిటల్ అకౌంట్స్ నుండి ఆధారాలను సేకరించడం కోర్టు ముందు పన్ను ఎగవేతను నిరూపించడానికి మాత్రమే కాకుండా, పన్ను ఎగవేతల ఖచ్చితమైన మొత్తాన్ని లెక్కించడానికి ఈ చర్యలో తోడ్పాటును అందిస్తుందని ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ వెల్లడించారు. దీనివల్ల భవిష్యత్తులో ప్రజలకు పన్ను ఎగవేత నోటీసులు కూడా వచ్చే ప్రమాదం పెరుగుతుందని నిపుణులు అంచనా వేస్తున్నారు.




# ప్రమాదాల నివారణకై లారీ డ్రైవర్లు సమయపాలన పాటించాలి

**జయశంకర్ భూపాలపల్లి, పెన్ పవర్:** రోడ్డు ప్రమాదాల నివారణ కోసం మరియు ట్రాఫిక్ జామ్ సమస్య ఉత్పన్నం కాకుండా ఇసుక లారీ డ్రైవర్లు పక్కాగా సమయపాలన పాటించాలని నిర్దేశిత సమయంలోనే ఇసుక లారీలు రోడెక్కాలని జయశంకర్ భూపాలపల్లి జిల్లా ఎస్పీ కిరణ్ ఖరే ఐపీఎస్

ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఉదయం 7 గంటల నుంచి 9 గంటల వరకు, మరియు సాయంత్రం 4 గంటల నుంచి రాత్రి 7 గంటల వరకు ఇసుక లారీలకు జాతీయ రహదారిపై అనుమతి లేదని, హోల్డింగ్ పాయింట్స్ లో చెక్పోస్టుల్లో ఇసుక లారీలు నిలిపిఉంచి, సమయపాలన ప్రకారం నడుచుకోవాలని పేర్కొన్నారు. ఇసుక లారీల ట్రాఫిక్ నియంత్రణకు రేగొండ కాటారంలో రెండు చెక్పోస్ట్ మరియు హోల్డింగ్ పాయింట్స్ ఏర్పాటు చేయడం జరిగిందని రేగొండలో ఎంటి ( ఖాళీ ) లారీలు, కాటారంలో ఇసుక లోడ్ లారీలు, పోలీసుల నిర్దేశిత సమయపాలన ప్రకారం నడుచుకోవాలని, ఉదయం, సాయంత్రం సమయపాలన పాటించాలని అన్నారు. రోడ్డుపై వాహనాలు ఆపి ఉండడం మూలంగా ప్రమాదాలు జరుగుతుండడంతో పాటు, ట్రాఫిక్ జామ్ అవుతుందని, రోడ్డుపై ఇసుక లారీలు పార్కింగ్ చేయకుండా 24 గంటలు పెట్రోలింగ్ వ్యవస్థను పటిష్టం చేశామని ఎస్పీ గారు పేర్కొన్నారు. అలాగే లారీ డ్రైవర్లకు ట్రాఫిక్ నిబంధనలతో పాటు, డ్రంక్ అండ్ డ్రైవ్, రోడ్డు ప్రమాదాల నివారణ, ఓవర్ స్పీడ్, పార్కింగ్ విధానం తదితర అంశాల అంశాలపై కౌన్సిలింగ్ నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. రోడ్డు ప్రమాదాల నియంత్రణకు, ట్రాఫిక్ సమస్యకు చెక్ పెట్టేందుకు జిల్లాలో కట్టుదిట్టంగా ట్రాఫిక్ నిబంధనలను అమలు చేస్తున్నామని, ఇసుక లారీ డ్రైవర్లు సైతం పోలీసులకు సహకరించాలని ఎస్పీ కిరణ్ కరే కోరారు.

# కేటీఆర్ పై కేసులు పెడితే ఊరుకోం

**నకిరేకల్ పెన్ పవర్:** నల్గొండ జిల్లా నకిరేకల్ లో ఈ నెల 21న లీకైన పదవ తరగతి తెలుగు పేపర్ వ్యవహారం రాజకీయ రంగు పులుముకుంది. ఈ కేసులో నకిరేకల్ అధికార పార్టీ ఎమ్మెల్యే వేముల వీరేశం అనుచరులను వదిలేశారంటు బిఆరెస్ నాయకులు చేసిన ఆరోపణలపై దూమారం లేస్తుంది. కేటీఆర్ ట్వీట్ చేసిన అంశాన్ని కాంగ్రెస్ నేతలు సీరియస్ గా తీసుకున్నారు. బిఆరెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పై నకిరేకల్ పోలీస్ స్టేషన్ లో ఒక ఎస్సి ఎస్టీ కేసు తో పాటు మరో రెండు కేసులు నమోదు చేశారు. అధికార పార్టీ తీరును బిఆరెస్ నేతలు తీవ్రంగా ఖండిస్తున్నారు. పోలీసులు అత్యుత్సాహం ప్రదర్శిస్తే మూల్యం తప్పదని హెచ్చరిస్తున్నారు. నకిరేకల్ మాజీ బిఆరెస్ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య స్పందిస్తూ పదవ తరగతి పేపర్ లీక్ వ్యవహారం లో పోలీసులు స్థానిక అధికార పార్టీ ఎమ్మెల్యే వీరేశం అనుచరులను ఎందుకు వదిలేశారో చెప్పాలంటూ మీడియా ముఖంగా ప్రశ్నించారు. తమ నాయకునిపై తప్పుడు కేసులు పెడితే బయపడబోమని, కోర్ట్ లపై తమకు నమ్మకం ఉందని అన్నారు..

# చిట్టీల సొమ్ముతో పరారైన పుల్లయ్య బెంగళూరులో అరెస్ట్



**హైదరాబాద్ పెన్ పవర్:** గత నెలలో హైదరాబాదులో పుల్లయ్య అనే వ్యక్తి రూ. 100 కోట్ల మేర చిట్టీల సొమ్ము వసూలు చేసి పరారైన సంగతి సంచలనం సృష్టించింది. దాదాపు 2 వేల మంది నుంచి అతడు చిట్టీల పేరుతో నగదు వసూలు చేసి, తిరిగి చెల్లించకుండా పారిపోవడంతో బాధితులు లబోదిబోమన్నారు. అతడిపై హైదరాబాద్ సీసీఎస్ పోలీస్ స్టేషన్ లో బాధితులు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు ప్రారంభించిన పోలీసులు... ఎట్టకేలకు చిట్టీల పుల్లయ్యను బెంగళూరులో అరెస్ట్ చేశారు. అతడితోపాటు రామాంజనేయులు అనే వ్యక్తిని కూడా అదుపులోకి తీసుకున్నారు. వారిద్దరినీ బెంగళూరు నుంచి హైదరాబాద్ తరలించారు. పుల్లయ్య స్వస్థలం అనంతపురం జిల్లా చందన లక్ష్మీపల్లి గ్రామం. హైదరాబాదులోని ఎస్సార్ నగర్ లో చిట్టీల వ్యాపారం నిర్వహిస్తున్నాడు. రూ. 5 లక్షల నుంచి రూ. 50 లక్షల వరకు చిట్టీలు నిర్వహిస్తుంటాడు. మొదట్లో చెల్లింపులు సక్రమంగా జరపడంతో ఖాతాదారులు మరింత పెరిగారు. ఇదే అదనుగా, అందినకాడికి వసూలు చేసుకుని ఇల్లు ఖాళీ చేసి వెళ్లిపోయాడు. 18 ఏళ్ల క్రితం నగరానికి వచ్చిన అతడు మొదట్లో అడ్డ మీద కూలీగా పనిచేశాడు. స్థానికులతో పరిచయాలు పెంచుకుని క్రమంగా చిట్టీల వ్యాపారంలో దిగాడు.

# పాతబస్తీలో ఎంఐఎంను ఎదుర్కొంటాం

హైదరాబాద్ పెన్ పవర్: పాతబస్తీలో ఎంఐఎం ఆగడాలు సాగనివ్వకుండా అడ్డుకట్ట వేస్తామని బీజేపీ భాగ్యనగర్ జిల్లా నూతన అధ్యక్షుడు నిరంజన్ యాదవ్ అన్నారు. కుర్మగూడ లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎంఐఎం నేతలు కనుసన్నల్లో ప్రభుత్వం, కొందరు అధికారులు వ్యవహరిస్తు న్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. అభివృద్ధి పను ల్లో సైతం పక్షపాత ధోరణి అవలంభిస్తున్నారని ఆరోపించారు. ఉద్దేశపూర్వకంగా అభివృద్ధిని అడుకుంటే బీజేపీ చూస్తూ ఊరుకోదని హెచ్చ రించారు. రాబోయే గ్రేటర్ ఎన్నికల్లో పాతబస్తీలో అధిక డివిజన్లలో బీజేపీ జెండా ఎగరవేసేందుకు సమష్టి కృషి చేస్తామని చెప్పారు. ప్రధాని మోదీ చేపడుతున్న ప్రభుత్వ పథకాలలో ప్రజలలోకి మరింతగా తీసుకు వెల్లుతామని చెప్పారు..కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ సహదేవ్ యాదవ్ .నేతలు మహేష్, యూగేందర్.ప్రమోద్. నవీన్ తదితరులు పాల్గొన్నారు.

# అప్సర హత్యకేసులో నిందితుడికి జీవిత ఖైదు



హైదరాబాద్ పెన్ పవర్: సంచలనం రేపిన అప్సర హత్య కేసులో రంగారెడ్డి కోర్టు సంచలన తీర్పునిచ్చింది. ఆమెను హత్య చేసిన నిందితుడు పూజారి సాయికృష్ణకు జీవితఖైదు విధించింది. కొన్నేళ్లుగా అప్సర అనే మహిళతో వివాహేతర సంబంధం నడిపిన సాయికృష్ణ 2023లో ఆమెను హత్య చేశాడు. అనంతరం మృతదేహాన్ని మ్యాన్ హోల్ లో పడేసి, అప్సర కనిపించడంలేదంటూ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. అతడిపై అనుమానం రావడంతో పోలీసులు దర్యాప్తు చేపట్టగా సాయికృష్ణ నిందితుడని తేలింది.

## రామోజీ ఫిలిం సిటీ ముట్టడి

హైదరాబాద్ పెన్ పవర్: పేదల ఇండ్ల స్థలాల రామోజీ ఫీల్మ్ సిటీ యాజమాన్యం కబ్జా చేసిందంటూ రామోజీ ఫీల్మ్ సిటీని ఇండ్ల స్థలాల లబ్దిదారులు ముట్టడించారు. లబ్దిదారులకు సిపిఎం మద్దతు నిలిచింది.

రంగారెడ్డి జిల్లా ఇబ్రాహీంపట్నం. మండలంలోని నాగాన్ పల్లి లో సర్వే నెంబరు 189.203 లలో రామోజి యాజమాన్యం కబ్జా చేసినా పేదల ఇంటి స్థలాలను ఇవ్వాలని సిపిఎం అద్వర్యంలో చలోరామోజీ ఫిల్మ్ సిటీ కార్యక్రమం నిర్వహించింది. సిపిఎం రాష్ట్ర కార్యదర్శి జన్ వెస్లీ తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. రామోజి ఫిల్మ్ సిటీ ఆధీనం లో ఉన్నా ఇండ్ల స్థలాలు భూములను పేదలకు ఇవ్వాలని ఆర్ఎఫ్సీ ఇంటి స్థలాల కమిటీ ఆధ్వర్యంలో ముట్టడించారు. ఫిలిం సిటీ గేట్లను తోసుకుంటూ లోపలికి వెళ్ళిన లబ్దిదారులు, .తమకు ప్రభుత్వం కేటాయించిన భూమిలో భీష్మించు కుర్చున్నారు.

# ఇఫ్తార్ విందులు కాదు-ముస్లిం మైనార్టీ హక్కులు కాపాడండి




హైదరాబాద్ పెన్ పవర్:దేశంలో 20 శాతం పైగా ఉన్న ముస్లిం మైనార్టీ హక్కులను కాలరాస్తూ గత పది సంవత్సరాలుగా దేశంలో పాలన చేస్తున్న బిజెపి కూటమి ప్రభుత్వం అనుసరిస్తున్న ముస్లిం వ్యతిరేక చర్యలను ఖండించవలసిన సమయం ఆసన్నమైందని పవిత్ర రంజాన్ మాసంలో వక్ఫ్ సవరణ బిల్లును పార్లమెంటు ఉభయ సభల్లో ఆమోదం కాకుండా తిరస్కరించ వలసి ఉన్నదని,అలాగే రాష్ట్ర శాసనసభలో వక్ఫ్ సవరణ బిల్లును వ్యతిరేకిస్తూ తీర్మానం చేయాలని కాంగ్రెస్ పార్టీ డిమాండ్ చేస్తుందని నేడు విజయవాడ రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ కార్యాలయం ఆంధ్ర తన భవన్లో జరిగిన విలేకరుల సమావేశంలో రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధి షేక్ సైదా అన్నారు.ఇఫ్తార్ విందులు ఏర్పాటు చేసి ముస్లింలు పట్ల ప్రేమ చూపిస్తూ మరోపక్క బీజేపీ ప్రవేశపెట్టిన ముస్లిం నల్ల చట్టాలకు జై కొట్టడం ఏ మాత్రం సమర్ధనియం కాదని ఆయన నిశితంగా విమర్శించారు. బీహార్ ముఖ్యమంత్రి నితీష్ కుమార్ ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందును ఆ రాష్ట్ర ముస్లిం సంఘాలు ప్రజాస్వామ్యవాదులు లౌకికవాదులు హాజరుకాకుండా బహిష్కరించాలని అలాగే దేశవ్యాప్తంగా ముస్లిం సోదరులు ప్రజాస్వామ్య వాదులు గత కొంత కాలంగా వక్ఫ్ సవరణ బిల్లును వ్యతిరేకిస్తూ ఆందోళన చేస్తున్నా, బిజెపి మంకు పట్టుతో ముస్లిం మైనార్టీలపై విద్వేషం వెళ్లగకుతుందని నిశితంగా విమర్శించారు.

కోట్లాది రూపాయలు విలువైన వక్ఫ్ ఆస్తులను అంబానీలకు కట్టబెట్టేందుకు కేంద్రం కుట్ర పన్నుతున్నదాని ఆయన తీవ్రంగా విమర్శించారు. వక్ఫ్ కమిటీలలో అన్య మతస్తులను ఏ విధంగా నియమిస్తారని ఆయన ప్రశ్నించారు. తిరుపతి, శ్రీశైలం, కనకదుర్గమ్మ దేవాలయ పాలకవర్గాలలో అన్యమతస్తులను రాష్ట్ర ప్రభుత్వ నియమిస్తుందా? అని షేక్ సైదా ప్రశ్నించారు. ఇఫ్తార్ విందులను ముస్లిం మైనార్టీ సంఘాలు లౌకికవాదులు ప్రజాస్వామిక వాదులు బహిష్కరించాలని ఆయన కోరారు.దేశంలో కాంగ్రెస్ పార్టీ జాతీయ అధ్యక్షులు మల్లికార్జున ఖర్గే, లోక్సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ గారి ఆధ్వర్యంలో అన్ని రాజకీయ పక్షాలను కూడగట్టి బిజెపి నాయకత్వంలోని ఎన్డీఏ కూటమి చేస్తున్న ప్రజాస్వామ్య వ్యతిరేక చర్యలను ఎండ గట్టు తూ కాంగ్రెస్ పార్టీ పార్లమెంటు వెలుపల బయట పెద్ద ఎత్తున పోరాడుతుందని, అలాగే రాష్ట్రంలో వైఎస్ షర్మిల రెడ్డి గారి సారధ్యంలో కాంగ్రెస్ పార్టీ ఎన్డీఏ కూటమి అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై పెద్ద ఎత్తున ఆందోళన నిర్వహిస్తుందని సైదా అన్నారు.రాష్ట్ర మైనార్టీ డిపార్ట్మెంట్ అబ్దుర్వర్ షేక్ బాజీ మాట్లాడుతూ దేశంలో మోడీ, అమిత్ షా విధ్వంసకర ఆలోచన విధానంతో ముస్లింలను అణగదొక్కేందుకు పెద్ద ఎత్తున కుట్ర పన్నుతున్నారని రాష్ట్రంలో బిజెపి అంటే బాబు, జగన్, పవన్ అని ఆయన ఎద్దేవా చేశారు వక్ఫ్ సవరణ బిల్లును వ్యతిరేకించాలని అలాగే రాష్ట్రంలో హజ్ కెళ్లే యాత్రికుల కోసం ఏర్పాటుచేసిన విజయవాడ విమానాశ్రయంలో ఎంబార్కుషన్ సెంటర్ ను ఎత్తివేయడం సమంజసం కాదని ఆయన తీవ్రంగా విమర్శించారు.

ఈ కార్యక్రమంలో రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి షేక్ కుర్షిదా , ఏపీ సి సి రాష్ట్ర మాజీ అధికార ప్రతినిధి ఎండీహెచ్ఎస్ బేగ్, ఏఐసీసీ మాజీ సభ్యులు సీనియర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు షేక్ బషీర్, ఏపీ సీసీ ప్రధాన కార్యదర్శి షేక్ అబ్దుల్ అన్సారీ, విజయవాడ సిటీ కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షులు షేక్ ఖాదర్ తదితరులు పాల్గొన్నారు.

# పంచాయతీ రాజ్ సవరణ బిల్లుపై మంత్రి సీతక్క సమాధానాలు

హైదరాబాద్ పెన్ పవర్:

పంచాయతీరాజ్ సవరణ బిల్లుపై చర్చ సందర్భంగా సభ్యులు లేవనెత్తిన ప్రశ్నలకు మంత్రి సీతక్క సమాధానం ఇచ్చారు.

ఈ బిల్లుపై చాలామంది సభ్యులు విలువైన సూచనలు చేశారు.

ఈ బిల్లులో లేని అంశాలను సభ్యులు ప్రస్తావించారు.సభ్యులు ప్రతిపాదనలు పంపితే పరిశీలిస్తాము. రాష్ట్రపతి ఉత్తర్వుల మేరకు ఆదిలాబాద్ నుంచి అచ్చంపేట వరకు షెడ్యూల్ ఏరియాలో గుర్తించారు. ఆ చట్టాన్ని 1/70 గా పిలుస్తారు. ఏజెన్సీ ప్రాంత ప్రజలకు ప్రత్యేక హక్కులు కల్పించేందుకు, అభివృద్ధి జరిగేందుకు 1/70 కృషి చేస్తుంది. రాష్ట్ర పతి ఉత్తర్వులు మేరకు ఏజెన్సీ గ్రామాలను గుర్తించారని అన్నారు. ఆ చట్టం అమల్లో ఏమన్నా సమస్యలు వుంటే పరష్కరిస్తాము. మాకు మున్సిపాలిటీ కావాలి అని ఎన్నో గ్రామ ప్రజలు అడుగుతున్నారు. మున్సిపాలిటీలు అయితే డెవలప్ అయితామని ప్రజలు భావిస్తున్నారు. ములుగు జిల్లా కేంద్రం అయినా మునిసిపాలిటీ చేయలేదు, కానీ ఇప్పుడు మనం ములుగును మున్సిపాలిటీగా చేసుకుంటున్నాం. ప్రజల అభిప్రాయం, కలెక్టర్లు పంపిన ప్రతిపాదనలు ఆధారంగా మున్సిపాలిటీలుగా అప్డేట్ చేస్తున్నాం. చానా మండలాల్లోని గ్రామాలను ఇతర జిల్లాల్లో కలిపారు. స్థానిక ఎన్నికల సందర్భంగా ఎన్నో గంధరగోలాలు తలెత్తుతున్నాయి. కొన్ని గ్రామాలు ఒక మండల పోలీస్ స్టేషన్ పరిధిలో ఉంటున్నాయి రెవిన్యూ పరిధి వేరే మండలంలో ఉంటుంది. ఆ సమస్యలకు పరిష్కారం చూపుతాం. ఇద్దరు పిల్లల నిబంధన ఎత్తేయాలని అడుగుతున్నారు క్యాబినెట్, సీఎం తో చర్చిస్తాం. కొత్త గ్రామపంచాయతీల లో రేషన్ దుకాణాలు ఏర్పాటు చేయాలి అన్న ప్రతిపాదనను పరిశీలిస్తాం. గ్రామాల్లో సమస్యలు ఉన్నాయని కొందరు సభ్యులు ప్రస్తావించారు వాటిని పరిష్కరిస్తున్నాం.స్థానిక సంస్థల్లో 42 శాతం రిజర్వేషన్లు కల్పించే బిల్లును మన ఆమోదించుకున్నాం. కేంద్రం ఆ బిల్లుకు చట్టబద్ధత కల్పిస్తే రిజర్వేషన్లు పెరుగుతాయి. అన్ని పార్టీలు కేంద్రం మీద ఒత్తిడి తేవాలని అన్నారు.

శాసనమండలి బిల్లును ఏకగ్రీవంగా ఆమోదించింది.

# ఓటుకు నోటు దొంగ రేవంత్ రెడ్డి అని మేము అనలేమా..? : కేటీఆర్



**హైదరాబాద్ పెన్ పవర్:** : శాసనసభలో అధికార పక్షంపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, సిరిసిల్ల ఎమ్మెల్యే కేటీఆర్ నిప్పులు చెరిగారు. కేటీఆర్‌ను ఉద్దేశించిన డిప్యూటీ సీఎం చేసిన వ్యాఖ్యలపై కేటీఆర్‌తో పాటు హరీశ్‌రావు మిగతా సభ్యులు మండిపడ్డారు. కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలు, అమలు చేస్తామన్న సంక్షేమ పథకాలపై నిలదీసే హక్కు ప్రధాన ప్రతిపక్షమైన బీఆర్ఎస్ పార్టీకి ఉందని కేటీఆర్ పేర్కొన్నారు. మేం సభను ప్రోవోక్ చేయాలనుకుంటే చేయొచ్చు.. 30 శాతం కమిషన్ అని కాంగ్రెస్ ఎమ్మెల్యేలే అంటున్నారు. 20 శాతం కమిషన్ అని సచివాలయంలో ధర్నాలు చేస్తున్నారు అని కేటీఆర్ అన్నారు.కేటీఆర్ వ్యాఖ్యలపై డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క స్పందిస్తూ.. ఒళ్లు దగ్గర పెట్టుకోని మాట్లాడాలని అనుచిత వ్యాఖ్యలు చేశారు. ఈ వ్యాఖ్యలపై కేటీఆర్‌తో పాటు హరీశ్‌రావు తీవ్రంగా స్పందించారు. క్షమాపణ చెప్పాలని బీఆర్ఎస్ సభ్యులు డిమాండ్ చేశారు.అనంతరం కేటీఆర్‌కు మాట్లాడేందుకు స్పీకర్ అవకాశం కల్పించారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ.. 2009 నుంచి కలిసి పనిచేస్తున్నాం. ఆయన డిప్యూటీ స్పీకర్‌గా ఉన్నప్పుడు నేను తొలిసారి ఎమ్మెల్యేగా వచ్చాను. ఆయనతో మాకు ఫ్రెండ్‌షిప్ ఉంది. గత 16 ఏండ్ల నుంచి ఆయనతో కలిసి పని చేస్తున్నాం. భట్టి గారంటే గౌరవం ఉంది. పెద్దన్నలాగా గౌరవిస్తాం. ఆది శ్రీనివాస్ వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నాం అని కేటీఆర్ పేర్కొన్నారు.ఓటుకు నోటు దొంగ రేవంత్ రెడ్డి అని మేము అనలేమా? అని కేటీఆర్ ప్రశ్నించారు. 30 శాతం కమిషన్లు తీసుకుంటున్నారని జడ్చర్ల కాంగ్రెస్ ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి అన్నారు. దాని మీద చర్య తీసుకోండి అని రెవెన్యూ మినిస్టర్‌ను కోరాను. 20 శాతం కమిషన్లు తీసుకుంటున్నారని కాంట్రాక్టర్లు సచివాలయంలో ధర్నా చేశారు. దాని మీద చర్య తీసుకోమని అడిగాను. రేవంత్ రెడ్డి రూ.50 కోట్లు ఇచ్చి పీసీసీ అధ్యక్ష పదవి కొనుక్కున్నాడని కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి అన్న మాటలు మేము అనలేమా? అని కేటీఆర్ ప్రశ్నించారు.

# బెట్టింగ్ యాప్స్ మూలాలపై తెలంగాణ ప్రభుత్వం గురి

**హైదరాబాద్ పెన్ పవర్:**
ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్న బెట్టింగ్ యాప్స్‌పై సీరియస్‌గా ఉంది తెలంగాణ ప్రభుత్వం. వీటిపై కన్నెర్ర చేసేందుకు ప్రత్యేకంగా సిట్ ఏర్పాటు చేస్తున్నట్టు ప్రకటించింది. ఈ అంశంపై అసెంబ్లీలో మాట్లాడిన సీఎం రేవంత్ రెడ్డి సిట్ ఏర్పాటు చేస్తున్నట్టు వెల్లడించారు. బెట్టి యాప్‌లు నిర్వహించినా, ఆడినా, ఆడించినా ప్రమోట్ చేసినా కఠిన చర్యలు తీసుకుంటామని వార్నింగ్ ఇచ్చారు. ఇప్పటికే వీటిని ప్రమోట్ చేసిన యూట్యూబర్స్, సినీ సెలబ్రెటీలకు నోటీసులు జారీ చేసింది. వారి కొందరు విచారణకు హాజరై ఎందుకు ఇలా చేయాల్సి వచ్చిందో చెప్పారు. ఇప్పుడు ఈ కేసులో మరో ట్విస్ట్ చోటు చేసుకుంది. బెట్టింగ్ యాప్స్ ప్రమోట్ చేస్తున్న వారిపై చర్యలు తీసుకుంటే ప్రయోజనం లేదని గ్రహించిన ప్రభుత్వం మూలాలపై ఫోకస్ పెట్టింది. అందులో భాగంగా నిర్వాహకుల వివరాలపై ఆరా తీస్తున్నారు. వాటిని నేలకూలిస్తే తప్ప ఈ మహమ్మారి నుంచి విముక్తి లభించదని భావిస్తోంది. మత్తుపదార్థాలకు బానిసలు అవ్వొద్దనే ఇప్పటి వరకు ప్రచారం చేస్తూ వచ్చాయి ప్రభుత్వం. ఇప్పుడు అంతకంటే ఎక్కువ ప్రమాదకరంగా మారుతున్నాయి బెట్టింగ్ యాప్స్. ఎక్కువ మంది యువకులే ఈ దందాలో చిక్కుకొని అప్పులుపాలవుతున్నారు. వాటిని తట్టుకోలేక కొందరు మానసికంగా కుంగిపోతున్నారు. ఇంకొందరు ఆత్మహత్య చేసుకుంటున్నారు. ప్రభుత్వం ఇప్పుడు సిట్ ఏర్పాటు చేస్తున్నట్టు ప్రకటించడంతో అందులో ఎవరెవరు ఉంటారనే ఆసక్తి ఉంది. సిట్‌కు ఎలాంటి రూల్స్ ఉంటాయి. ఏ దిశలో కేసును తీసుకెళ్లనున్నారనేది ఇంకా తేలాల్సి ఉంది. కాలపరిమితి ఏమైనా విధిస్తారా అన్నది కూడా తెలియాలి. బెట్టింగ్ యాప్స్ కట్టడికి ప్రభుత్వం చిత్తశుద్ధితో ఉందన్నారు రేవంత్‌రెడ్డి. యాప్‌లు నిర్వహించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని వార్నింగ్ ఇచ్చారు. అంతే కాకుండా వాటిని ప్రోత్సహించే వారిని కూడా ఉపేక్షించబోమని తేల్చి చెప్పారు. బెట్టింగ్ యాప్స్‌ను సినిమా, టీవీ, యూట్యూబ్ సెలబ్రెటీలు చాలా మంది ప్రమోట్ చేశారు. వాళ్లందరిపై కేసులు నమోదు అయ్యాయి. అగ్రనటులు కూడా ఈ కేసుల వలయంలో చిక్కుకున్నారు.

ఈ లిస్ట్ పెరిగిపోవడంతో ప్రభుత్వం రూట్ మార్చింది. ప్రమోట్ చేసిన వారిపై చర్యలు తీసుకున్నంత మాత్రాన ప్రయోజనం ఉండటం లేదని గ్రహించింది. అందుకే బెట్టింగ్ యాప్స్ నిర్వాహకుల పని పట్టేందుకు సిద్ధమైంది. ఇప్పటికే పలువురును గుర్తించింది. త్వరలోనే వారికి నోటీసులు జారీ చేసే అవకాశం ఉంది. సిట్‌లు ఏర్పాటు చేయడం ప్రభుత్వాలకు రివాజుగా మారిపోతోంది. అప్పట్లో సినిమా ఇండస్ట్రీలో డ్రగ్స్ వాడకంపై కూడా ప్రభుత్వాలు సిట్‌లు వేశాయి. కొందరు సెలబ్రెటీలను పిలిచి విచారించాయి. ఈ ప్రభుత్వం కూడా వచ్చిన మొదట్లో హడావుడి చేసింది. కానీ తర్వాత ఆ విషయమే మర్చిపోయింది. ఆ కేసు ఏమైందో పత్తా లేదు. ఇప్పుడు బెట్టింగ్ యాప్స్‌పై వేసే సిట్ కూడా అదే దారిలోకి వస్తుందా అనే అనుమానం కూడా ప్రజల్లో ఉంది.

## ఓయూలో జరుగుతున్న సదస్సు కు హాజరైన గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ

**హైదరాబాద్ పెన్ పవర్:**గవర్నర్ కు ఓయూ హాస్టల్ సమస్యలపై వినతిపత్రం ఇవ్వడానికి ఓయూ పూర్వ విద్యార్థి సత్య తోపాటు విద్యార్థులు యత్నం?అరెస్టుహైదరాబాద్ ఓయూ లోని ఫిజిక్స్ విభాగంలో నిర్వహించిన అంతర్జాతీయ సదస్సును గవర్నర్ ప్రారంభించడానికి రాగా ఉస్మానియా యూనివర్సిటీలోని విద్యార్థి నాయకులు ఆయనను కలిసి వినతిపత్రం అందజేయడానికి ప్రయత్నించారు. అందులో భాగంగా ఫిజిక్స్ కళాశాల ముందు పూర్వ విద్యార్థి సత్య ఆధ్వర్యంలో పలువురు విద్యార్థులు వినతి పత్రం తీసుకొని గవర్నర్ ను కలిసి ప్రయత్నించారు. దీంతో పోలీసులు వారిని అడ్డుకొని పోలీస్ స్టేషన్కు తరలించారు. ఈ సందర్భంగా పూర్వ విద్యార్థులు ఓయూ వి.సి ప్రొఫెసర్ కుమార్ కు వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ ఓయు లో ప్రజాస్వామిక సర్కులర్ తీసుకొచ్చి ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు.

## కారుణ్య నియామకాల్లో భాగంగా ప్రభుత్వ ఉద్యోగ పత్రం అందజేత



**హైదరాబాద్ పెన్ పవర్:**తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఆదేశానుసారం కారుణ్య నియామకాల్లో భాగంగా 8 నెలల క్రితం అనారోగ్యంతో చనిపోయిన హెడ్ కానిస్టేబుల్ సయ్యద్ సలీముద్దీన్, కుమారునికి జూనియర్ అసిస్టెంట్ ఉద్యోగ నియామక పత్రాన్ని అందజేసిన పోలీస్ కమిషనర్ డాక్టర్ బి. అనురాధ
ఈ సందర్భంగా పోలీస్ కమిషనర్ మాట్లాడుతూ. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఆదేశానుసారం కారుణ్య నియామకాల్లో భాగంగా 8 నెలల క్రితం అనారోగ్యంతో చనిపోయిన హెడ్ కానిస్టేబుల్ సయ్యద్ సలీముద్దీన్, కుమారుడు సయ్యద్ సోహెల్ పాషా కు జూనియర్ అసిస్టెంట్ ఉద్యోగ నియామక పత్రాన్ని అందజేయడం జరిగిందని తెలిపారు. విధి నిర్వహణలో మరణించిన పోలీసు కుటుంబాలకు విడతలవారీగా కారుణ్య నియామకాలలో ఉద్యోగాలు వస్తాయని తెలిపారు. నీతి నిజాయితీగా ఉద్యోగాలు చేస్తూ డిపార్ట్మెంట్ కు మంచి పేరు తీసుకుని రావాలని సూచించారు.ఈ కార్యక్రమంలో సిద్దిపేట ఏసీపీ మధు, ఏఓ యాదమ్మ, సూపరిండెంట్ ఫయాజుద్దీన్, ఎస్బి ఇన్స్పెక్టర్ కిరణ్, రాష్ట్ర పోలీస్ సంఘం ఉపాధ్యక్షులు రవీందర్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## భద్రాచలంలో ఆరంతస్తుల భవనం కూలి ఇద్దరు మృతి

**భద్రాద్రి కొత్తగూడెం మార్చి 26: పెన్ పవర్:**భద్రాచలంలో ఘోర ప్రమాదం జరిగింది. భద్రాచలం పంచాయతీ ఆఫీసు దగ్గర నిర్మాణంలో ఉన్న ఓ ఆరంతస్తుల భవనం కూలిపోయింది. భవనంలో పని చేస్తున్న కార్మికుల్లో ఇద్దరు అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు. సమాచారం అందుకున్న పోలీసులు, రెస్క్యూ సిబ్బంది.. ప్రమాదస్థలికి చేరుకుని సహాయక చర్యలు ప్రారంభించారు. జేసీబీలతో శిథిలాలను తొలగిస్తున్నారు. మృతదేహాలను వెలికితీసేందుకు పోలీసులు తీవ్రంగా శ్రమిస్తున్నారు. ఈ ప్రమాదం జరిగిన వెంటనే ఇంటి యజమాని శ్రీపతి శ్రీనివాస్ రావు పారిపోయాడు. ఎలాంటి అనుమతులు లేకుండా భవన నిర్మాణం చేపట్టినట్లు తెలిసింది.

## ఆరోగ్యం

## డాక్టర్ ఎండి. తిరుపతిరావు

**హైదరాబాద్ పెన్ పవర్:** డయాలిసిస్ చేసే సమయంలో శరీరంలోని రక్తాన్ని క్రిందున్న ఎర్ర ట్యూబ్ ద్వారా బయటకు తీసి, డయాలిసిస్ యంత్రంలో శుభ్ర పరచి, నీలి రంగు ట్యూబ్ ద్వారా తిరిగి శరీరంలోకి పంపిస్తారు. శరీరంలోని రక్తమంతా శుభ్రపరచడానికి సుమారుగా 4 గంటలు పడుతుంది. ఈ నాలుగు గంటలు శరీరాన్ని కదల్చకుండా ఉంచాలి. ఈ ప్రక్రియ వారానికి మూడు సార్లు, నెలకు 12 సార్లు నిర్వహించాలి. ప్రతిసారీ 4 గంటలు, అంటే నెలకు 48 గంటలు, వెచ్చించాలి. డయాలిసిస్ అవసరం లేని వారిలో, ఈ ప్రక్రియను, ఎలాంటి ప్రయాస మరియు అసౌకర్యం లేకుండా, కిడ్నీలు రోజుకు 36 సార్లు వాటంతటవే చేస్తాయ్.

ఇది చదివిన తరువాత, మిత్రులు.. అతిగా మద్యం సేవించక పోవడం, ధూమపానం చేయకపోవడం, బయట హోటళ్లలో ఫాస్ట్‌ఫుడ్ సెంటర్లలో లభించే తిను బండారాలకు సాధ్యమైనంత వరకు దూరంగా ఉండడం, అధిక చక్కెర మైదా తో తయారయ్యే పదార్థాలను చాలా చాలా మితంగా తీసుకోవడం, అన్నిటికంటే ముఖ్యంగా శారీరక శ్రమ చేయడం.. వంటి ఉత్తమ జీవన శైలి అలవాట్లను అలవరచుకుంటారని ఆశిస్తా. ఎందుకంటే, ఇవి, మన కాలేయం మరియు కిడ్నీలను ఆరోగ్యంగా ఉంచుకోవడానికి అందుబాటులో ఉన్న అత్యంత చౌకైన మార్గాలు.

మంచి ఆరోగ్యానికి ఎల్లప్పుడూ కృతజ్ఞతగా ఉండండి. డాక్టర్ ఎండి. తిరుపతిరావు అన్నారు.

## కామర్స్ విద్యార్థులకు అపారమైన అవకాశాలు

**విజయవంతమైన కామర్స్ టాలెంట్ టెస్ట్**




**జగిత్యాల, పెన్ పవర్:** కామర్స్ విద్యార్థులకు అపారమైన ఉద్యోగ అవకాశాలు ఉన్నాయని రామకృష్ణ డిగ్రీ, పీజీ కళాశాలచైర్మన్ యాద రామకృష్ణ అన్నారు. జగిత్యాల పట్టణం లోని రామకృష్ణ డిగ్రీ, పీజీ కళాశాలలో ఇంటర్మీడియట్ సెకండియర్ విద్యార్థులకు బుధవారం నిర్వహించిన కామర్స్ టాలెంట్ టెస్ట్ కు విశేష స్పందన లభించింది. కామర్స్ లో విద్యార్థుల ప్రతిభను వెలికి తీయుటకు నిర్వహించిన ఈ పరీక్షలో సుమారు 200 మంది విద్యార్థులు పాల్గొన్నారు. అనంతరం పరీక్షలో ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థులకు నగదు బహుమతులతో పాటు సర్టిఫికెట్ అందజేశారు. ప్రథమ స్థానాన్ని అల్ఫోర్స్ జూనియర్ కళాశాలకు చెందిన గ్రీష్మ కైవసం చేసుకున్నది. ద్వితీయ, కన్సోలేషన్ బహుమతులను విద్యార్థులకు అందజేశారు. కార్యక్రమంలో రామకృష్ణ డిగ్రీ అండ్ పీజీ కళాశాల చైర్మన్ యాద రామకృష్ణ మాట్లాడుతూ కామర్స్ విద్యార్థులు తమ నేర్చుకున్న విద్యకు నైపుణ్యాన్ని జోడిస్తే మంచి వ్యాపారవేత్తలుగా ఎదుగుతారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో నలంద డిగ్రీ కాలేజ్ ప్రిన్సిపల్ శ్రీపాద నరేష్, రామకృష్ణ డిగ్రీ కళాశాల డైరెక్టర్ పల్లెర్ల నరేష్. ప్రిన్సిపాల్ కొక్కుల రాజేందర్, కామర్స్ అధ్యాపకులు సిబ్బంది పాల్గొన్నారు.

# ఫ్లైట్లో వస్తారు..

## ఏటీఎం కట్ చేసి లక్షలు దోచుకెళ్లిపోతారు

**హైదరాబాద్ పెన్ పవర్:** ఉత్తరాదిలో కొన్ని గ్రామాల నుంచి డ్యూటీలకు వచ్చినట్లుగా దక్షిణాదికి వచ్చి దోపిడీలు చేసి మళ్లీ తమ స్వగ్రామాలకు వెళ్లిపోయే ముఠాలు చాలా ఉంటాయి. అలాంటి ముఠాల్లో ఒకటి హైదరాబాద్ పోలీసులకు చిక్కింది.

మహేశ్వరం, రావిర్యాల్లో మార్చి ఒకటో తేదీన రెండు ఏటీఎంలలో డబ్బులు దోచుకెళ్లారు. ఏటీఎంలను కట్ చేసి.. చాలా నేర్పుగా లక్షలు కొట్టేసి వెళ్లిపోయారు. పోలీసులు ఈ పని ఎవరు చేశారో పూర్తి స్థాయిలో ఆరా తీశారు. కొన్ని వందల సీసీపుటేజీలు గుర్తించారు. ఇతర సాంకేతిక ఆధారాలను విశ్లేషించిన తర్వాత వారికి అసలు క్లారిటీ వచ్చింది. వారి కోసం హర్యానాకు వెళ్లి ఖాకీ సినిమాలో ఛేజ్ చేసినట్లుగా చేసి.. నిందితుల్ని అరెస్టు చేసి తీసుకొచ్చారు. కేవలం మూడు అంటే 3 నిమిషాల్లో ఎటిఎం లో ఉన్న 29 లక్షలు కాజేసిన ఈ దొంగలను మీడియా ముందు ప్రవేశ పెట్టారు. గతంలో కుషాయిగూడ, ఃఆఒ బానూర్, ఒడిశా లో ఏటీఎం లను కొల్లగొట్టారని పోలీసులు తెలిపారు. ఊఆఈఅ, గాఃఎ ఎటిఎం ల చోరీ కేస్ చెదించేందుకు చాలా కష్టపడ్డామని కమిషనర్ తెలిపారు. నిందితులు మొత్తం ఇతర రాష్ట్రాలకు చెందిన వారే ఎక్కువ కానీ.. హైదరాబాద్ కు చెందిన రాహుల్ అనే వ్యక్తి కీలక సూత్రధారిగా గుర్తించామన్నారు. హర్యానా లో ఉన్న ఒకే గ్రామానికి చెందిన నిందితులు .. నిర్మానుష్య ప్రదేశంలో ఉన్న ఏటీఎం

లే వీరి టార్గెట్ చేసుకుంటారని పోలీసులుతెలిపారు. రావిర్యాల్ తో పాటు వరపర్తి, మైలార్దేవ్ పల్లి కొంగరకలాన్ వెళ్ళారు అక్కడ కూడా రెక్కి చేసి మార్చ్ 1 న రావిర్యాల లో ఏటీఎం లో ఉన్న 29.60 లక్షలు ఎత్తుకెళ్లారు. జులాయి సినిమా తరహా లో ఏటీఎం లో డబ్బులు కొట్టేసిన రాజస్థాన్ , హర్యానా ముఠా అని.. యూట్యూబ్ లో విడియో లు చూసి ఏటీఎం ను కట్ చేసినట్లుగా గుర్తించారు. మొత్తం 10 మందిని గుర్తించామని.. అందరూ రాజస్థాన్, హర్యానా కు చెందిన ముఠా సభ్యులన్నారు. ఏటీఎంను దొంగతనం చేసేందుకు ఫ్లైట్ లో ఒచ్చిన నిందితులు .. పని అయిపోయాక మళ్లీ ఫ్లైట్ లోనే వెళ్లిపోయారు. సినిమా తరహా లో దొంగతనానికి యంత్రాలను ప్రత్యేకంగా కొనుగోలు చేసేవారు. మరో ఐదుగుర్ని అరెస్టు చేయాల్సి ఉంది. 4 లక్షలు నగదు స్వాధీనం చేసుకున్నారు.

# ఎంఎంటీఎస్ రైళ్లలో మహిళల రక్షణ కోసం దక్షిణ మధ్య రైల్వే కీలక నిర్ణయం

**హైదరాబాద్, మార్చి 26 పెన్ పవర్:** మహిళల భద్రత కోసం దక్షిణ మధ్య రైల్వే నిర్ణయం తీసుకుంది. ఎంఎంటీఎస్ రైళ్లలో పానిక్ మోడ్ బటన్స్ ఏర్పాటు చేయాలని నిర్ణయం తీసుకుంది. పానిక్ బటన్ ప్రెస్ చేయగానే క్షణాల వ్యవధిలో రైల్వే పోలీస్ వచ్చేలా ఏర్పాట్లు చేయాలని రైల్వే అధికారులు భావిస్తున్నారు. ఖీఖఈ తో ఎల్లప్పుడూ నిఘా ఉంటుందని చెబుతున్నారు. ఎంఎంటీఎస్ రైళ్లలో భద్రతపై దక్షిణ మధ్య రైల్వే జీఎం అరుణ్ కుమార్ జైన్ ఆరా తీశారు. ఇటీవల హైదరాబాద్‌లోని ఎంఎంటీఎస్ రైలులోనే మహిళపై అత్యాచారయత్నం జరగడం కలకలం రేపింది. దాంతో నగరవాసులు ఒక్కసారిగా ఉలిక్కిపడ్డారు. ఇళ్లు, ప్రైవేట్ ప్రాంతాలతో పాటు పబ్లిక్ స్థలాల్లోనూ బాలికలు, మహిళలకు రక్షణ కరువైందని మహిళా సంఘాలు ఆవేదన వ్యక్తం చేస్తున్నాయి. ఇకపై ఎంఎంటీఎస్ రైళ్లలో ఇలాంటి ఘటనలు జరగకుండా ఒక రైల్వే పోలీస్ అధికారి పర్యవేక్షణ చేస్తారని తెలిపారు. ఇకపై రైళ్లలో ఒక పోలీస్ తో బందోబస్తు ఉంటుందని, మహిళలకు మరింత భద్రత కల్పిస్తామని అరుణ్ కుమార్ జైన్ పేర్కొన్నారు.



ఎంఎంటీఎస్ రైలులో యువతిపై అత్యాచారయత్నంఈ ఘటన తెలంగాణ మొత్తాన్ని షేక్ చేసింది. కదులుతున్న రైలు నుంచి యువతి భయాందోళనతో కిందకి దూకేసిందంటే మహిళలకు రక్షణపై సందేహాలు నెలకొన్నాయి. శనివారం (మార్చి 22న) సాయంత్రం ఫోన్ రిపేర్ చేయించుకునేందుకు ఓ యువతి మేడ్చల్ నుంచి ఎంఎంటీఎస్ రైలులో సికింద్రాబాద్ కు వెళ్లింది. పని పూర్తి చేసుకుని రాత్రి 8 గంటలకు తిరిగి ఎంఎంటీఎస్ రైలు ఎక్కింది. అల్వాల్ స్టేషన్లో కంపార్ట్ మెంట్లో ఉన్న ఇద్దరు మహిళలు దిగిపోయారు. యువతి ఒంటరిగా ఉందని గమనించి నిందితుడు వికృత చేష్టలకు పాల్పడ్డాడు. ఆమెను అసభ్యకరంగా తాకుతూ తన కోరిక తీర్చాలంటూ బలవంతం చేశాడు. ఆందోళనకు గురైన యువతి అతడ్ని ప్రతిఘటించి కదులుతున్న రైలు నుంచి దూకేసింది. ఆమెను గమనించిన కొందరు పోలీసులకు సమాచారం ఇవ్వంగా 108లో గాంధీ ఆసుపత్రికి తరలించి చికిత్స అందించారు. ఎంఎంటీఎస్ రైల్లో యువతిపై అత్యాచారయత్నం కేసులో పోలీసులు నిందితుడిని అదుపులోకి తీసుకుని విచారణ చేపట్టారు. పోలీసులు 4 బృందాలుగా ఏర్పడి గాలించడంతో మంగళవారం ఓ యువకుడ్ని అదుపులోకి తీసుకున్నారు. అతడు గంజాయికి బానిసైన పాత నేరస్తుడు అని పోలీసులు తెలిపారు. మేడ్చల్ జిల్లా గౌడవల్లికి చెందిన జంగం మహేశ్ యువతిని వేధించాడని పోలీసులు భావిస్తున్నారు. నిందితుడి ఫొటోను చూపించగా.. యువతి సరిగ్గా గుర్తించలేదని సమాచారం. మరోవైపు నిందితుడ మహేశ్‌కు వివాహం కాగా, కొన్ని నెలల కిందట భార్య అతడ్ని వదిలేసింది. తల్లిదండ్రులు సైతం చనిపోవడంతో మహేశ్ ఒంటరయ్యాడు. గంజాయి సేవించడం లాంటి చెడు వ్యసనాలకు బానిస అయ్యాడని పోలీసులు తెలిపారు.